
ఎన్.వి. బ్రహ్మం



Cat-1353

211
బ్రహ్మం కలలో
89591

# కలలో దేవుడు

## రాయిస్టు దర్శనం

ఎమ్. ఎన్. రాయ్ కి శత జయంతి కానుక

# కలలో దేవుడు

## రాయిస్టు దర్శనం

ఎన్. వి. బ్రహ్మం

మనీషా విద్యా విహార్
చీరాల - 523 155

ప్రథమ ముద్రణ
మార్చి 1987

ప్రతులు
1000

Cat - 1753

211

—: ప్రతులకు :—

ఎన్. వి. బ్రహ్మం,
మనీషా విద్యావిహార్,
చీరాల - 523 155

సుందరయ్య గ్రంథాలయ
A.C. No. 89591
హైదరాబాద్-500 0

ముద్రణ : లిబర్టి ప్రింటర్స్ (మ్యా), చీరాల

హక్కులు
రచయితవి

వెల
ఆరు రూపాయలు

# రాయిస్టు దర్శనం

పదునాలుగేళ్ళ విద్యార్థిగా నేను నా రాజకీయ జీవితం ప్రారంభించాను. అది అప్రయోజకంగా అంతమయినా కావచ్చు. ఆ రోజుల్లో నేను స్వేచ్ఛగా జీవించాలనుకొన్నాను. సంపూర్ణమూ సార్వకాలికమూ అయిన స్వాతంత్ర్య భావన కొత్తగా తలెత్తింది. పాత పద్ధతులు పాటించిన ఆనాటి విప్లవకారులు స్వేచ్ఛా పరిభాషలో ఆలోచించారు. ఆ రోజుల్లో మేము మార్క్సిజము చదివి వుండలేదు; కార్మిక వర్గపు ఉనికినిగూర్చి వినివుండలేదు. అయినా మాలో చాలామంది తమ జీవితాలు జైళ్ళలో గడిపారు; ఉరికంబాలెక్కారు. వారికి ప్రేరణ ఇవ్వటానికి కార్మికవర్గం లేదు. వారికి వర్గపోరాటాన్ని గూర్చిన స్పృహ లేదు; కమ్యూనిజాన్ని గూర్చిన కల లేదు; కాని భరింపరాని జీవిత పరిస్థితులపై తిరుగుబాటు చెయ్యాలన్న మానవ సహజమైన ప్రేరణ మాత్రం వుంది. ఆ పరిస్థితులను మార్చగల పద్ధతులు వారికి కచ్చితంగా తెలియవు ఏమైనా వాటిని మార్చటానికి ప్రయత్నించారు. నేను నా రాజకీయ జీవితాన్ని ఆ భావంతోనే ప్రారంభించాను. మూడు కాపిటల్ సంపుటాలకన్నా మూడువందల మార్క్సు సంపుటాలకన్నా ఆ భావమే నా ఉత్తేజానికి ఆధార భూతంగా వుంటున్నది.

- ఎమ్. ఎన్. రాయ్

'కలలో దేవుడు' పుట్టి కచ్చితంగా తరం గడిచింది. 1962 ఆరంభంలో యీ రచన రూపు దాల్చింది. ఆ యేడు సాధారణ ఎన్నికల సందర్భంగా బాపట్లలో ఎం. వి. రామమూర్తిగారింట్లో వారి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాడికల్ హ్యూమనిస్టు సంఘ అత్యవసర సమావేశం జరిగింది. ఆవుల గోపాలకృష్ణమూర్తిగారి సూచన మేరకు ఆ ఎన్నికల్లో రాడికల్ హ్యూమనిస్టులు నిర్వహించవలసిన పాత్రనుగూర్చి రూపొందించిన ఒక తీర్మానాన్ని అధ్యక్షులవారే చదివి సభ్యుల అభిప్రాయా లర్థించారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో ఆనాటి స్వతంత్ర పార్టీకి అనుకూలంగా కృషి చెయ్యాలన్నదే ఆ తీర్మాన సారాంశం.

ఆనాటి సభలో ముందు మాట్లాడవలసివచ్చిన కోగంటి సుబ్రహ్మణ్యం గారు ఆ తీర్మానాన్ని వ్యతిరేకించారు. దానితో గోపాలకృష్ణమూర్తి గారు క్రాస్ పరీక్ష ప్రారంభించారు. వారికి పరిహాస ప్రహసాలతో సభలోనుంచి వత్తాసుకూడా వచ్చింది. ఎలాగైతేనేం? సుబ్రహ్మణ్యంగారు గందరగోళ పడి, తన అభీష్టానికి ప్రతికూలంగానే, తీర్మానానికి అనుకూలంగా 'ఆఁ' అన వలసి వచ్చింది.

తర్వాతవంతు నాదయింది. 'రాడికల్ డెమోక్రాటిక్ పార్టీని రద్దు చేసుకొని తాత్వికోద్యమాన్ని స్థాపించుకొన్న పార్టీ రహిత ప్రజాస్వామ్య వాదులకు అలాంటి తీర్మానం చేయవలసిన గతి ఎందుకు పట్టాలి? ముందు దాన్ని చించివేయండి' అంటూ తీవ్రస్థాయిలోనే అందుకొన్నాను. అందుకు తగినట్లే మరింత తీవ్రమైన ప్రతిఘటన నెదుర్కొవలసి వచ్చింది. అయితే చర్చలో మూడో మనిషి జోక్యాన్ని ముందుగా ఆపిం చాను. ఏమైనా గంటపాటు సాగిన వాగ్యుద్ధం ఫలితంగా తీర్మానం తోసి వేయబడింది.

కాని అలాంటి స్వల్ప విషయం మీద తగు మాత్రపు తాత్విక అవ గాహన గల ఇద్దరు రాడికల్ హ్యూమనిస్టుల మధ్య అంతటి తీవ్ర వివాదం తలెత్తవలసి రావటం నా మనస్సును నిజంగా కల్లోల పరిచింది. ఎవరిది సరియైనమార్గం, ఎవరిదికాదు అన్న మీమాంస నాలో రేగింది. 'కలలో దేవుడు' ఆవిర్భావం ఆ మానసిక కల్లోలంలో నుంచే. ఇది నా వైజ్ఞానిక జీవితంలో ఒక పెద్ద మలుపు.

* * *

'కలలో దేవుడు'లో సంభాషకులు ఇద్దరు – నేను, దేవుడు. నేపథ్యం స్వప్నం. స్వప్న జగత్తులో సమస్తం తైజసుడే (స్వాప్నికుడే) కదా! అంటే నా స్వప్నంలో నేనే సర్వస్వం. 'నేను' నేనే, 'దేవుడు' నేనే. వాదాన్నీ ప్రతివాదాన్నీ నేనే. దృక్కునూ దృశ్యాన్నీ దృష్టినీ కూడానేనే. కాబట్టి స్వప్న స్వభావం దృష్ట్యా చూస్తే, 'కలలో దేవుడు' నాలో రేగిన కల్లోలమేతప్ప మరేమీకాదు. ఈ వ్యాఖ్యానం కలగన్నాననే నాకేవరిమితం.

ఇది చదివే ఇతరులకిది వర్తించదు కదా. వారి అవగాహనలో కల అన్నది ఇక్కడ ఒక మిష మాత్రమే. కనుక ఇక్కడ 'నేను' ఏమిటో 'దేవుడు' ఏమిటో ఈ రచన యొక్క అంతర్యమేమిటో - అన్న అంశాలను అపార్థం చేసుకొనే అవకాశం వుండవచ్చు. అందుకే యీ కొంచెం వివరణ

'నేను' అనేది చిన్న నేను - రాడికల్ హ్యూమనిస్టు. 'దేవుడు' అనేది పెద్ద నేను-రాయిస్టు. రాయిస్టును ఇక్కడ హ్యూమనిస్టు అన్నా అనవచ్చు. నా దృష్టిలో ఎమ్. ఎన్. రాయ్ పరిణామ సర్వస్వమే కాక, పరిణామ అంతర్యం కూడా రాయిజమే. అంటే రాయ్ పరిణమించిందీ, పరిణమించబోయేదీ కూడా రాయిజమే అన్నమాట. రాయిజం అనంతం. అందులో ఎన్నో మైలురాళ్ళు; వాటిలో రాడికల్ హ్యూమనిజ మొకటి.

రాడికల్ హ్యూమనిస్టు అయిన 'నేను'కు ఒక దశలో ధ్వనించిన రాయ్ మాటలోని అక్షరం (Letter) చాలు; కాని రాయిస్టు అయిన 'దేవుడి'కి అన్ని దశలను అనుసంధించే రాయ్ మాటలోని అంతర్యం (Spirit) కావాలి. ప్రధానంగా 'నేను' ది వాదం (ఆలోచన); 'దేవుడు' ది పథం (ఆచరణ). ఒకరు కథకులు, మరొకరు పథికులు. ఒకరు సంఘ ప్రియులు, మరొకరు ఉద్యమ ప్రియులు. ఇరువురివి పూర్తిగా విడదీయ రాని విభిన్నతత్వాలు

ఎమ్.ఎన్ రాయ్ దర్శనం ఒక్కొక్కరికి ఒక్కొక్కరకంగా కావచ్చు. ఆయనను దైవసముడుగా భావించే భక్తులకు మాత్రమే ఆయన దర్శనం ఒకే మోస్తరుగా అయ్యే అవకాశముంది. అలాంటి దాస్య బుద్ధులను రాయ్ అయితే దరికి చేరనిచ్చేవాడు కాదు.

ఎమ్. ఎన్. రాయ్ గొప్ప జిజ్ఞాసువు. జిజ్ఞాసకు మూసలుండవు మూసలుండేది విశ్వాసులకే. వ్యక్తిత్వాన్ని నిర్ణయించేవి జిజ్ఞాసా సృజనలే. అవి లేని వారు మనుషులు కావచ్చునేమో కాని, వ్యక్తులు మటుకు కారు. ప్రతి వ్యక్తీ జిజ్ఞాసా సృజనలతో జ్ఞాన స్వేచ్ఛా సంపన్నుడుగా మారాలని ఆకాంక్షించాడు రాయ్. వ్యక్తిత్వవికాసానికి సంస్థాబంధాలు ప్రతిబంధకాలన్న దూర దృష్టితోనే ఆయన పార్టీని రద్దుచేసి ఉద్యమాన్ని నెలకొల్పాడు.

మనిషి ఎంత మేరలో సంస్థాగతు డవుతాడో అంతమేరలో తన వ్యక్తిత్వాన్ని కోల్పోతాడు. మానవ సమాజ చరిత్రలో అభ్యుదయ మన్నది వ్యక్తుల ప్రతిభా విశేషాలతోనే కొనసాగింది కాని సమష్టి ప్రయత్నంతో సాగలేదు. సమష్టి ప్రయత్నంవేరు, సహకార ప్రయత్నం వేరు. రెండోది తాత్కాలికం, కనుక వ్యక్తిత్వాని కది విరోధి కాదు. కాని మొదటిది దీర్ఘకాలికం, కనుక దానిలో వ్యక్తిత్వం మరణవేదనకు గురి కాక తప్పదు.

ఇదీ రాయ్ జిజ్ఞాసకు పర్యవసానం. నేను రాయ్‌ని దర్శించిన పద్ధతి ఇది. దీని ప్రకారం రాడికల్ హ్యూమనిస్టు సంఘం రాయిజంలో ఇమడదు. అంటే హ్యూమనిజంలో ఇమడదనే.

* * *

ఎమ్. ఎన్. రాయ్ ఏనాడో మానవ నాగరికతా చరిత్రను 'అటవిక దశనుంచి నాగరిక దశదాకా' అని రాశాడు. ఆ శీర్షిక ఆయన రాజకీయ జీవితానికి కూడా వర్తిస్తుంది. రాయ్ రాజకీయ జీవితం తీవ్రజాతీయ వాదంతో అరంభమయింది, అదొక జాగృతమైన అటవికదశ. తర్వాత మార్క్సిజం మజిలీలో చాలకాలం మకాం చేసి, చివరకు రాడికల్ హ్యూమ నిజం వరకు వచ్చి, అంతటితో ఆయన జీవితం అంతమయింది రాడికల్ హ్యూమనిజ మొక జాగృతమైన నాగరిక దశ. కనుక మానవ సమాజ పరిణామానికి 'అటవికదశ నుంచి నాగరికదశ దాకా' అన్నది వర్తిస్తే రాయ్ జీవిత పరిణామానికి 'తీవ్ర జాతీయవాదం నుంచి నవ్య మానవ వాదం దాకా' అన్నది వర్తిస్తుంది.

రాయ్ నవ్యమానవవాదం (రాడికల్ హ్యూమనిజం)ఆయన ఉన్నా దాకా నిత్య పరిణామం చెందుతూ నిత్యనవ్యంగా వుండేది. ఆయన ఆలోచనల్లో మాటిమాటికి చేర్పులు మార్పులు చోటుచేసుకొంటూ వుండేవి. అయితే రాడికల్ హ్యూమనిస్టు తత్వాన్ని 22 సూత్రాల్లో బంధించటం మూలంగా రాయ్ పొరపాటు చేశాడు. సిద్ధాంత పరమైన అలాంటి మూస ప్లేటో, హెగెలు, మార్క్సులనుంచి సంక్రమించింది.

రాడికల్ హ్యూమనిజాన్ని సూత్రబద్ధం చేసిన రాయ్ మనస్సు ఏ బంధానికీ బద్ధం కాక పోయినా, చాలమంది రాడికల్ హ్యూమనిస్టుల

ఖరగ్రీలు సూత్రబద్ధాలై అడుగు ముందుకు వేయలేక ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాయి. రాడికల్ హ్యూమనిస్టు పండితులు సైతం చాలమంది రాయ్ ఆలోచనలకు వ్యాఖ్యానాలు తయారు చెయ్యటంతప్ప ఆ ఆలోచనల అంతర్యాన్ని ఆకలింపు చేసుకొని తదనుగుణంగా ప్రవర్తించలేక పోతున్నారు. అందుకొకముఖ్యకారణం రాడికల్ హ్యూమనిజానికీ రాయిజానికీ గల తారతమ్యాలను తరచిచూడలేక పోవటమే.

రెండో డెహ్రాడూన్ అధ్యయన శిబిరంలో 1946 మే 13 న ఎమ్. ఎస్. రాయ్ మొట్ట మొదటగా రాడికల్ హ్యూమనిజం ప్రాతిపదికలు ప్రతిపాదించాడు. ఆనాటి సభకు అధ్యక్షత వహించిన తర్కతీర్థ లక్ష్మణ శాస్త్రి జోషి రాయ్‌ని సంతప్తాంతరంగంగా పేర్కొన్నాడు. రాయ్ తన ఉపన్యాస ప్రారంభంలో యీ విషయాన్ని ప్రస్తావిస్తూ - నాటి వరకు సాగిన తన వంభై ఏళ్ళ రాజకీయజీవితం ఒక సంతప్తాంతరంగం స్వేచ్ఛ కోసం సాగించిన అన్వేషణే (A tormented soul's search for freedom) అని చెప్పుకొన్నాడు. వాస్తవానికి 1954 జనవరి 25 రాత్రి ఆయన కన్ను మూసే దాకా ఆ అన్వేషణ కొనసాగింది. ఆయన సార్థక జీవితంలో ఉగ్రవాదం, జాతీయవాదం, సామ్యవాదం, నవ్యమానవవాదం అనేవి పూసలు మాత్రమే. జీవితాంతం రాయ్ సంతప్తాంతరంగం స్వేచ్ఛ కోసం పడ్డ తపనయే యీ పూసలన్నిటిలోను ప్రసరించే దారం. దీనినే రాయిజం అంటున్నాను నేను.

అందువల్ల రాయ్ జీవితంలో చివరి పూస అయిన రాడికల్ హ్యూమనిజం రాయిజానికి హద్దుకాదు. అదే హద్దు అనుకొనేవారంతా స్వేచ్ఛాన్వేషణ కోసం సంతప్తమవుతూ వచ్చిన రాయ్ అంతరంగాన్ని అపార్థం చేసుకొంటున్నారన్నమాట. అందుకే నా అభిప్రాయంలో రాయిజానికి రాడికల్ హ్యూమనిజానికీ హస్తిమశకాంతరం. ఒకరకంగా చెప్పుకోవలసివస్తే రాయిజానికి రాడికల్ హ్యూమనిజంకన్నా హ్యూమనిజం సన్నిహితం. ఎందుకంటే హ్యూమనిజానికి లేని పరిధులు, పరిమితులు రాడికల్ హ్యూమనిజానికున్నై. రాయిజానికికూడా పరిధులులేవు. అందుకే రాయిజం చారిత్రికమైన హ్యూమనిస్టు సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహిస్తూ హ్యూమనిజానికి సన్నిహితంగా వున్నదంటున్నాను.

రాయ్ తన జీవితంలో చాలా మాటలు చెప్పాడు. వాటిలో చివరి మాట రాడికల్ హ్యూమనిజం. ఇంకా బతికి వుంటే ఏ మాట చెప్పి వుండేవాడో! కాని రాయ్ బాట ఒకటే. అది స్వేచ్ఛాన్వేషణ. అదే రాయిజం— అంటే హ్యూమనిజం.

కాకపోతే — స్వేచ్ఛాపిపాస, సత్యాన్వేషణ అనేవి మానవుని ప్రధాన ప్రేరణలని రెండో సూత్రం చెప్పటంలేదా అని తగాదాకు దిగవచ్చు తజ్ఞులు. కాని నాలుగో సూత్రంలో మానవుడు నియమ బద్ధమైన ప్రకృతికి బద్ధుడుగా చెయ్యబడటంతోనే స్వేచ్ఛ మరణించింది. ఇంకెక్కడి అన్వేషణ?

యూరపులో పునర్వికాసయుగంలో వచ్చిన మానవవాదం మానవుణ్ణి దైవాంశంగా భావించటంవల్ల దైవం ప్రధానమై మానవు డప్రధానమైనాడనీ, అలా మానవుడు తన చర్యలకు తాను కర్త కాలేక పోయాడనీ, యీ దైవ కేంద్రభావనను తొలగించి శాస్త్రాధారంతో మానవుణ్ణి అతని కాళ్ళపై నిలబెట్టటమే రాడికల్ హ్యూమనిజం చేసినపని అనీ, అందుకే అది నవ్య మానవవాద మవుతున్నదనీ ఎమ్. ఎన్. రాయ్ ఎన్నో సందర్భాలలో చెప్పాడు. కాని అలా జరిగినట్లు దాఖలాలు కనపడవు. ఇక్కడ దైవం స్థానాన్ని ప్రకృతి ఆక్రమించటం తప్ప విశేష మేమీ లేదు.

మానవుణ్ణి మతం దైవబద్ధుణ్ణి చేసింది; మార్క్సిజం ఆర్థిక బద్ధుణ్ణి చేసింది. రాడికల్ హ్యూమనిజం ప్రకృతి బద్ధుణ్ణి చేసింది. ఈ అన్నిచోట్ల మానవుడు ఏదో ఒక నియతికి బద్ధుడే. వ్యాఖ్యాతల దృష్టిలో దైవ నియతికన్నా ఆర్థిక నియతి మిన్న కావచ్చు-అంతకన్నా ప్రకృతి నియతి మరింత మిన్న కావచ్చు. ఒకటి ఇనుప పంజరం; మరొకటి వెండి పంజరం; ఇంకొకటి బంగారు పంజరం; తేడా ఇంతే. మానవుణ్ణి ఏదో ఒక బాహ్యాంశం పరంగా వివరించవలసిన గతి ఎందుకు పట్టాలి? మానవుణ్ణి మానవ పరంగానే ఎందుకు వ్యాఖ్యానించకూడదు?

దైవకేంద్రభావన దైవవాదమవుతుంది; ఆర్థిక కేంద్రభావన ఆర్థిక వాదమవుతుంది. ప్రకృతి కేంద్రభావన ప్రకృతివాద మవుతుంది; అదేదీ మానవ వాదం కాజాలదు. మానవ కేంద్రభావన ఒక్కటే మానవ వాదం

కాగలదు అలా రాయ్ ఆవిష్కరించిన నవ్యమానవవాదం ఆయన ఆశించిన నవ్యతను మానవవాదంలో తేలేకపోతున్నది. రాయ్ మాట అయినంత మాత్రాన అది రాయ్ బాట కావాలని లేదు. రాయ్ బాట స్వేచ్ఛాపథమైన మానవవాదం.

• • •

మానవవాదం మానవుని తోనే అవతరించిందంటాడు రాయ్. అది యథార్థం. ఈ మానవవాద దృక్పథం ఎన్నో విలువలతో కూడి వికాసం చెందుతూ వస్తున్నది. ఈ విలువలు సార్వకాలికాలు ఇవి లేకుండా మానవవాదం లేదు. కాని నేటి శాస్త్రానికి మానవ విలువలతో పనిలేదు. దానికి కావలసిందల్లా కొలతలకందే ప్రాథమిక గుణాలే (Primary Qualities). కొలతల కందని అనుషంగ గుణాల (Secondary Qualities) కు — అంటే విలువలకు — శాస్త్రంలో స్థానంలేదు. గెలిలియోతో ఆరంభమైన దవదగిన ఆధునిక శాస్త్రం అనుషంగగుణాలైన యీ మానవవిలువలతో తెగతెంపులు చేసుకొని, ఒడ్డూ పొడుగూ ఉరువూ బరువూ లాంటి ప్రాథమికగుణాలకే తన పరిధిని పరిమితం చేసుకొన్నది. అలా శాస్త్రజ్ఞానం ఒక మొద్దు పద్ధతికి అంకితమైపోయి మానవ వాద ఆంతర్యానికి దూరమైపోయింది. అందుచేతనే అది మానవుని ఉనికికీ మనికికీ పవాలుగా ఒక పెనుభూతం లాగా పరిణమించిన ఆధునిక సాంకేతిక యుగానికి ఆస్కారమయింది.

అంతేకాదు మానవవాదానిది సృజనాత్మక తత్వం కాగా శాస్త్రానిది విధ్వంసక స్వభావం. భౌతిక శాస్త్రాలు ప్రకృతిదానిని విభజించి చూడటాని కలవాటు పడితే — జీవశాస్త్రాలూ వాటి అనుబంధశాస్త్రాలూ జీవులను చిత్రవధచేసికాని తనివి చెందవు. ప్రయోగాల పేరుతో పరిశోధనల పేరుతో తండోపతండాలుగా జీవులను వధించిగాని తృప్తి పొందదు శాస్త్రం. ప్రయోగశాలలోని యీ హింసాత్మక - విధ్వంసక ప్రవృత్తే బహిరంగంగా మానవ మారణ హోమంగా పరిణమిస్తున్నది.

అలా అమానుష పంథాను అనుసరించిన ఆధునిక శాస్త్రాన్ని రాడికల్ హ్యూమనిజానికి ఆధారంగా చేసి రాయ్ మరొక పొరపాటు చేశాడు. ఇదీ తన పూర్వాశ్రమమైన మార్క్సిజం ప్రభావమే. మానవవాదాన్ని శాస్త్రబద్ధం చెయ్యటంకాదు కావలసింది; శాస్త్రాన్ని మానవవాదబద్ధంగా

మార్పట మెలాగన్నది నేటి ప్రధానసమస్య. దీని కనుకూలమైన పరిష్కారం లభిస్తేనే యీ గడ్డపై మానవజాతి మనగలుగుతుంది.

మానవ వాదానికి ప్రధాన ప్రాతిపదికలు మూడు. మానవుడు సమాజానికి మూలమన్న సాంఘిక భావన ఒకటి. అన్ని విలువలకు మానవుడే ప్రమాణమన్న నైతిక భావన రెండు. మానవుడు తన ప్రపంచానికి తానేకర్త అన్న తాత్విక భావన మూడు. ఈ ప్రాతిపదికల ప్రతిపాదనకు శాస్త్రాన్ని దేబిరించాల్సిన పనిలేదు. వీటి వివరణకు అవసరమనుకుంటే అవకాశమున్నంత మేరలో దాన్ని వాడుకోవచ్చు. అంతవరకే. శాస్త్రానికి సేవక స్థానమే కాని యజమాని పీఠం దక్కకూడదు. దక్కితే ఫలితమేమిటో మనం కళ్ళార చూస్తునే వున్నాం.

•• •• ••

మనిషిలో వివేక మెంత వాస్తవమో ఉద్వేగమూ అంత వాస్తవమే. వివేకం ఇటీవల తలెత్తిన చేతనకు చెందింది. ఉద్వేగం కోటానుకోట్ల ఏళ్ళ జీవపరిణామంలో వేళ్ళు పాతుకొని విలసిల్లుతూ వస్తున్న అధశ్చేతనకు చెందింది. మానవుని మనస్సులో పదింట తొమ్మిది పాళ్లు అధశ్చేతనయే. కనుక దానితో పోలిస్తే చేతన అతి దుర్బలమైనది. అందుకే వివేక సంబంధియైన సత్య(శాస్త్ర) విలువకన్నా ఉద్వేగ సంబంధియైన సౌందర్య (కళ) విలువ మానవుణ్ణి అధికంగా అకట్టుకొంటున్నది. అందుకే మనిషిలో సౌందర్య విలువ సంతృప్తిపొందకుండా సత్య విలువ స్థానం పొందలేదు. ఈ యథార్థతను రాడికల్ హ్యూమనిజం విస్మరించింది.

1966 లో ఆవుల గోపాల కృష్ణమూర్తిగారి స్మారక సంచిక 'స్వేచ్ఛాన్వేషణలో' లో నేను 'మానవవిలువలు – నవ్యమానవవాదం' అని రాశాను దానిలో యీ అంశాన్ని దిఙ్మాత్రంగా పేర్కొన్నాను. 'రాడికల్ హ్యూమనిజం వివేకాన్నీ ఉద్వేగాన్నీ సూత్రప్రాయంగా గుర్తించినా అది మానవునిలోని వివేకంపైననే విశేషంగా నొక్కు చూపింది. ఉద్వేగాన్ని చిన్నచూపు చూచింది. అందువల్లనే ఉద్వేగ సంబంధియైన సౌందర్య విలువ కానీ దాని సంబంధ విలువలు కానీ రాడికల్ హ్యూమనిస్టు పరిభాషలోనికెక్కలేదు. ఆ కారణంగా కూడా రాడికల్ హ్యూమనిజం పరిపూర్ణ తత్వశాస్త్రం కాలేక పోతున్నది' అనీ, 'వ్యక్తిగతంగా రాయ్ సౌందర్య పిపాసువే. ఈ పిపాస ఆయన జీవితంలో ఆయన స్వీయ స్మృతులలో అడు

గడుగునా గోచరిస్తుంది. రాడికల్ హ్యూమనిజం ఆయన సమగ్ర జీవితం నుంచి నిష్పన్నమైనది కాదు. దాని ప్రాతిపదికలు పాక్షికమైన ఆయన వైజ్ఞానిక జీవితానికి మాత్రమే చెందినవి. ఈ వాస్తవికత కూడా తన సిద్ధాంతం యొక్క అసమగ్రతకు దోహద మయింది' అనీ రాశాను. రెండు న్నర దశాబ్దులుగా సాగుతున్న నా యీ విచక్షణాత్మకమైన అన్వేషణలో నా అభిప్రాయం బలపడుతున్నదేకాని సడలటం లేదు. అందుకే రాయిజా నికి భిన్నంగా రాడికల్ హ్యూమనిజంలో సంకుచితత్వం చోటుచేసుకొన్నది అంటున్నాను.

అంతేకాదు. రాడికల్ హ్యూమనిజం మానవుణ్ణి సమగ్రంగా దర్శించ లేక పోవటంవల్ల అది హేతువాదం కాళ్ళపై నిలబడాల్సివచ్చింది. అందుకే చిరంతనమైన నీతిని సైతం హేతుబద్ధం చేసింది. మానవుడు హేతుబద్ధుడు కనుకనే నీతిబద్ధుడవుతున్నాడని వాదిస్తున్నది. అది అన్యాయం. అనుభవ విరుద్ధం.

నాకు ఎంతోమంది మతస్థులతో, హేతువాదులతో, నవ్యమానవ వాదులతో, వివిధ వర్గాల రాజకీయ వాదులతో సన్నిహితసంబంధం వుంది. వారి వారి వ్యక్తిగత జీవితాలను గమనిస్తుంటే — దైవభావం లేకపోతే మానవుడు అవినీతిపరుడవుతాడనే మతవాదులకన్నా దైవభావంతో మాన సికంగా పరతంత్రుడు కావటంవల్లనే మానవుడు అవినీతిపరుడవుతున్నాడనే హేతువాదులు మూర్ఖతలో ఏ మాత్రం తీసిపోరని తేలింది. మతస్థుల్లోకానీ, హేతువాదుల్లో కానీ, మానవవాదుల్లో కానీ, తదితరులలో కానీ, రాద్ధాంత సిద్ధాంతాలలో రాటుదేలి, ఉద్గ్రంథాలు రాసి పారేసిన బడా బడా పండితులు సైతం నీతిమంతులుగా ప్రవర్తిస్తున్నట్లు నిదర్శనంలేదు నాకు. హేతు 'వాదా' నికికానీ, మత'వాదా'నికి కానీ మరే'వాదా'నికి కానీ పీఠమైన వివేకం మనిషిని నీతిమంతుడుగా చేయలేక పోతున్నదని నా అనుభవంలో తేలింది. అందువల్ల మానవుని అస్తిత్వానికి అభ్యుదయానికి ఆధారభూతమైన నైతిక ప్రవర్తనను మానవు డెందుకు అలక్ష్యం చేస్తున్నాడు? అన్న ప్రశ్నరాక తప్పదు కదా.

సామాజిక మానవుని నైతిక సమస్యా పరిష్కారానికి జిజ్ఞాసువులు తాత్వికులు అనాదిగా కృషిచేస్తూనేవున్నారు; కాని విఫలు లవుతూ వచ్చారు.

నా 'కలలో దేవుడు' ఈ సమస్యను మరో కోణంనుంచి దర్శించాడు. ఇలాంటి వివరణ మన ప్రాచీనులలో కానీ అర్వాచీనులలో కానీ ఎవరైనా ఇచ్చారేమో నాకు తెలియదు. నాకు ప్రాచీనుల యోగపద్ధతిని గూర్చిన పరిజ్ఞానం లేదు. ఎదుటి వ్యక్తి అధశ్చేతనకు సూచనలిచ్చి అతనిలో కొన్ని అద్భుత పరిణామాలు తీసుక వస్తున్నది సమ్మోహ విద్య (హిప్నాటిజం). ఇది అనుభవ విరుద్ధమూకాదు, అశాస్త్రీయమూ కాదు. యోగాన్ని స్వయం సమ్మోహ విద్య (సెల్ఫ్ హిప్నాటిజం) అన్నాడు అబ్రాహాం కోవూరు. యోగాన్ని యీ పరిమితార్థంలో మాత్రమే 'కలలో దేవుడు' స్వీకరించాడు. అంతేకాని యీ పుస్తకంలోని యోగసాధనకు **'అతీత'** శక్తులతో ఎంత మాత్రం నిమిత్తంలేదు.

చేతనకు చెందిన హేతు చింతన ఎంతగా నీతిని నిలబెట్టాలన్నా, అది చేజిక్కకుండా అడ్డుపడుతున్నది అధశ్చేతనయే అన్న అభిప్రాయం నాలో బలపడుతున్నది. అలాంటప్పుడు, అధశ్చేతన సహకరించకుండా చేతన చేయగలిగేది ఏదీ లేదన్న నిర్ణయానికి సహజంగానే వచ్చాను. ఇక చేతనకూ అధశ్చేతనకూ మధ్య సయోధ్య కలిగించటానికి సాధన సంపత్తి ఏమిటి అని ఆలోచించాను. నా పరిమిత జ్ఞానానికి పరిస్తుతానికి తోచిన పరిష్కారమార్గ మిది. దీనిలోని బాగోగులు చర్చించి, ఇది సరైన మార్గమనుకుంటే దీనికి అవసరమైన మెరుగులు దిద్ది, దీనిని వీలైనంత ఆచరణయోగ్యంగా మార్చి సామాజిక ప్రయోజనాన్ని సాధించే విధానానికి విజ్ఞులు పూనుకోవాలని నా ఆకాంక్ష. ఈ మార్గం సరైనది కాదనుకొంటే ఇంతకన్నా ఉత్తమమైన మార్గాలనన్నా అన్వేషించటానికి పూనుకోవలసి వుంటుంది. మనకు కావలసింది ఎలుకను పట్టటం, పిల్లి ఏదైతేనేమి?

మానవుని సామాజిక జీవితంలో నైతిక ప్రవర్తనకు స్థానం లేకుండా పోతున్నదన్నది ఎవ్వరూ కాదనలేరు. నైతిక సమస్యా పరిష్కారంపైననే సామాజిక సమస్యల పరిష్కారం ఆధారపడి వున్నది. కాని ఈ సమస్యను పరిష్కరించటంలో మతవాదులూ హేతువాదులూ సమానంగా విఫలులయ్యారు. ఇది నిర్వివాదాంశం.

నైతిక సమస్యను కీలక సమస్యగా భావించి దాని పరిష్కారానికి ఎంతో తపన పడ్డాడు ఎమ్. ఎన్. రాయ్. విద్య ద్వారా మానవ ప్రవర్తనను మార్చవచ్చునని చాటాడు. కాని విద్యావంతులైన తన అనుచరుల లోనే విద్య తగు మార్పులు తీసుకరాలేక పోతున్నదన్న అంశాన్ని పసి కట్టలేక పోయాడు. పసికట్ట గలిగినా, దానికి మార్గాంతరాన్ని అన్వేషించే అవకాశం తన అవసానదశలో లభించలేదు.

అయినా ఎమ్. ఎన్. రాయ్ నీతిని చిరంతనమైనదిగా దర్శించాడు. దానిని సాపేక్షంగా పరిగణించలేదు. మానవవిలువలే నీతికి నిధాన మన్నాడు. ఈ విలువలు ఆదిమమానవునితో అవతరించాయనీ, అవి దేశకాల పరిస్థితులకు పరిమితమయ్యేవి కావనీ పూసలలో దారంలాగా మానవుని సర్వతోముఖ జీవితంలో వ్యాపరిస్తూ మానవతను పరిరక్షిస్తూ వుంటాయనీ ఆయన పదే పదే పలికాడు. ఈ పలుకుల్లోనేవుంది రాయిజం అంతర్యం. మానవుడంటే వివేకం కాదు; వివేకం గుర్తించిన మానవ విలువలు. వాటి పరిరక్షణకు పాటుపడటంలోనే వివేకానికి - హేతు బుద్ధికి - చరితార్థత సిద్ధిస్తుంది. ఇదే మానవవాదపథం. చిరంతనమైన యీ పథాన్నుంచి పైదొలంగటంలోనే శాస్త్రాల అమానుషత్వం రుజువవుతున్నది.

ఆధునిక శాస్త్రాల వాసన బొత్తిగా లేని ప్రాచీన కాలంలో పలు దేశాల సంస్కృతులలో బలమైన మానవవాదచ్ఛాయలు కనిపిస్తున్నాయి. గ్రీసు, చైనా, ఇండియాలే ఇందుకు నిదర్శనాలు. ప్రాచీన గ్రీసు అంటే పడిచచ్చే కొందరు పండితులకు ప్రాచీనభారతం అనగానే ఒళ్ళంతా తేళ్ళూ జెర్రిలూ పారకాడతాయి. పాశ్చాత్యులు తమ ప్రాచీన గ్రీకు సంస్కృతిని పునర్నిర్మించుకొని నాలుగు శతాబ్దుల క్రితం పునర్వికాసం పొందారు. కాని యీ పండితులు తమ ప్రాచీన భారతీయ సంస్కృతిని నిర్మూలించుకొని పునర్వికాసం (!) పొందాలని ఉబలాటపడుతుంటారు. నిరంతరం పాశ్చాత్య విజ్ఞాన సంస్మరణచేస్తూ శాస్త్రాల వ్యామోహంలోపడి ఆదిమానవునితో పుట్టి విలసిల్లుతూ వస్తున్న మానవ విలువలకు తిలోదకాలిస్తున్నారు వీరు. యూరపు పునర్వికాసం యూరపు గడ్డ నాధారం చేసుకొని విలసిల్లి నట్లే, భారతదేశ పునర్వికాసం భారతదేశపు గడ్డ నాధారంచేసుకొని విలసిల్లవలసి వుంటుందన్న సత్యాన్ని వీరు గుర్తించటం లేదు. వికాసం భారతదేశానిది కానప్పుడు పునర్వికాసం భారతదేశానిదెలా అవుతుందో నాకు బొత్తిగా అర్థంకాని విషయం.

'If the unfortunate Mother India is ever to regain her rightful place in the cultural Commonwealth of Nations-her Past must be reinterpretted, her present reorganised and her future reorientated' (దురదృష్టవంతురాలైన భారత మాత ఏనాటికైనా వివిధ దేశాల సాంస్కృతికసమాఖ్యలో సముచితస్థానాన్ని తిరిగి సంతరించుకోవాలంటే— ఆమె గతాన్ని పునర్వ్యాఖ్యానించాలి; ఆమె వర్తమానాన్ని పునర్నిర్మించాలి; ఆమె భవిష్యత్తును పునర్వికసింప చేయాలి) అన్న ఎమ్. ఎన్. రాయ్ ఆవేదన వారి ఆలోచనా పరిధికి అందినట్లులేదు. గతాన్ని పునర్వ్యాఖ్యానం చెయ్యటమంటే గతంలోని అధమ ఘట్టాల్ని కొన్నిటిని ఎంపిక చేసుకొని వాటిని దూయబట్టుతూ కూర్చోవటం కాదు. లేదా ఉత్తమ ఘట్టాలకు తమ అపార్థాల నంటగట్టి దుర్వ్యాఖ్యానం చేయటమూ కాదు. అలా చేసినందువల్ల వచ్చేది (పునర్) వినాశమే కాని పునర్వికాసం కాదు. పునర్వికాసం రావాలంటే భారతదేశపు గతాన్ని రాగద్వేషరహితంగా అధ్యయనం చేసి, అందలి ఉత్తమాంశాలను వెలికి తీసి, వాటికి ప్రజా బాహుళ్యంలో బహుళ ప్రచారమిచ్చి, వాటిని నేటి భారతీయ జీవితానికి అనుసంధించి చూపాలి. అప్పుడు గాని భారతీయ జీవనం పునర్నిర్మితమై పునర్వికాసం పొందదు.

అలా భారతదేశపు గతాన్ని నెమరు వేసుకొంటే శాస్త్రాలతో నిమిత్తం లేని శాస్త్రీయ మానవ వాదచ్ఛాయలు కావలసి నన్ని కనిపిస్తాయి. 'న మనుష్యాత్ శ్రేష్ఠతరం హి కించిత్' (మానవుని కన్నా శ్రేష్ఠతరమైన దేదీ లేదు), 'సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా పరో దదా తీతి కుబుద్ధిరేవ' (సుఖదుఃఖాలు ఒకరిచ్చేవి కావు; పరుల వల్ల కలుగుతున్న వనటం దుష్ట చింతన) వంటి మహాభారత సూక్తులు గానీ; 'ఆహార నిద్రా భయ మైథునాని సామాన్య మేతే పశుభిర్నరాణాం ధర్మోహితేషా మధికో విశేషో ధర్మేణ హీనాః పశుభిస్సమానాః' (ఆహార నిద్రా భయమైథునాలు పశువులకూ మనుషులకూ సమానం; ధర్మదృష్టి మనుషులకు విశేషమైనది; ఈ దృష్టిలేనివారు పశువులతో సమానులే), 'దైవం నిహత్య కురు పౌరుష మాత్మశక్త్యా' (దైవాన్ని నెట్టివేసి నీ బుద్ధిబలంతో పురుషప్రయత్నం చెయ్యి) వంటి పంచతంత్ర ప్రబోధాలు కానీ; 'యథా చిత్రకరో రూపం యక్షస్యాతి భయంకరం సమాలిఖ్య స్వయం భీత స్సంసారేఽవ్యబుధ స్తథా' (చిత్రకారుడు భయంకరమైన యక్షుని రూపాన్ని చిత్రించి దాన్ని చూచి తానే

భీతచిత్తుడై వట్లుగా అజ్ఞాని భయంకరమైన వాతావరణాన్ని కల్పించుకొని దాన్ని చూచి తానే బెంబేలు పడిపోతుంటాడు) అనే నాగార్జునాచార్యుని వ్యంజనాత్మకసూక్తి కానీ. మానవవాద హృదయాన్ని ప్రతిపాదించటం లేదా? 'మీకు మీరే జ్యోతులు కండి', 'నీవు ఆ మార్గంగా మారితే తప్ప ఆ మార్గాన పయనింపజాలవు' వంటి బుద్ధుని వైయక్తికతాత్విక సూక్తులు మానవవాద ప్రబోధాలు కావా? ఇన్ని ఎందుకు? ప్రాచీన బౌద్ధం, జైనం, చార్వాకం మానవవాద ఉద్యమాలు కావా? విష్ణుశర్మ, భర్తృహరి, వేమన, బద్దెనవంటి వారు సృజించిన భారతీయ సాహిత్యంలో మానవవాద ధోరణు లెన్ని లేవు? పాతాకరోత కొత్తాకవింతఅనేసంకుచితమైన రాగద్వేషప్రవృత్తికి స్వస్తి చెప్పి, మనసు విప్పి పరికిస్తే భారతీయుల హృదయాల్లో నాటుకొని వారిలో కొంతమేరకు ఆరోగ్యకరమైన పరివర్తనం తీసుకరాగల అంశా లెన్నో మన ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తాయి. గతాన్ని పునర్వ్యాఖ్యానం చెయ్యటమంటే తాలూతపకా వదలిపెట్టి గట్టిగింజను వేరు పరచా లన్నదే రాయ్ అభిప్రాయం. భారతదేశ పునర్నిర్మాణ పునర్వికాసాల కాధారభూతమైన యీ పునర్వ్యాఖ్యానం రాయిజంలో అత్యంత ప్రముఖమైనది.

ఆనాటి యీ మానవవాదచ్ఛాయలకు మానవవాద అంతర్యానికి దూరమైపోయిన యీనాటి విజ్ఞాన శాస్త్రాల సర్టిఫికెట్లతో పనిలేదు శాస్త్రాలు వేరు, శాస్త్రీయ దృష్టివేరు. తార్కికమైన శాస్త్రీయ దృష్టి అతిప్రాచీనం. దీనికి అవసరమైన హంగులు అన్వేషించుకోవచ్చు. అది వేరే విషయం.

* * *

ఇక రాడికల్ హ్యూమనిస్టు సంఘాన్ని గూర్చి రెండు మాటలు. సంఘానికి ఉద్యమానికీ గల వ్యత్యాసాన్ని గూర్చి 'కలలో దేవుడు' ప్రవచించాడు. అనుబంధ సంపాదకీయాల్లో నేను ప్రస్తావించాను. 'దేవుడు' చెప్పినా, నేను చెప్పినా ఎమ్. ఎన్. రాయ్ చెప్పిన దాంట్లో ఎన్నోవంతు కాబట్టి?

1948 డిసెంబరులో రాడికల్ డెమోక్రాటిక్ పార్టీని రద్దు చేసుకొని, దాని స్థానంలో రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమాన్ని నెలకొల్పాడు రాయ్. అంతేకాని వేరే రాడికల్ హ్యూమనిస్టు సంఘం అనుచు స్థాపించలేదు.

ఉద్యమం వ్యష్టి ప్రధానమైనది. సమష్టి వైపు మొగ్గుదల సంఘానికి అని వార్యం. సంఘానికి నిమిత్తమాత్రపు విలువ యిస్తే, దానివల్ల చెరుపు లేక పోవచ్చు. కాని రాడికల్ హ్యూమనిస్టు సంఘం క్రియాశీలమైనది; కనుక నిమిత్తమాత్రం కాదు. కాదు కాబట్టి సమష్టితత్వ వాసనలు దానికి సోకుతున్నాయి. సువిశాలమైన జీవితానుభవం కలిగి, మనుషుల మనస్తత్వాల లోతులు దర్శించ గలిగిన రాయ్ అందుకే సంఘాన్ని కాకుండా ఉద్యమాన్ని నెలకొల్పాడు. సంఘంలో వ్యవస్థీకరణ, ఉద్యమంలో వ్యక్తీకరణ ప్రాధాన్యం వహిస్తాయి, కనుక ఉద్యమ భావనలో రాయ్ ధ్యేయం వ్యక్తిని వ్యవస్థపై నిలబెట్టటమే.

అయితే 1962 నుంచి సంఘ భావాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన నేను 1982 మే నెలలో ఆంధ్రప్రదేశ్ రాడికల్ హ్యూమనిస్టు సంఘ అధ్యక్షుడుగా ఎన్నిక కావటం వైరుధ్యం కాదా అనవచ్చు. కాదని ఆత్మవంచన చేసుకోవలసిన అవసరం నాకులేదు. ఎటూ రాడికల్ హ్యూమనిస్టు సంఘం ఉద్యమ స్వభావాన్ని కోల్పోయింది. అందుచేత ఆంధ్రప్రదేశ్‌కు చెందినంత వరకైనా సంఘాధ్యక్షుడుగావుండి రాడికల్ హ్యూమనిస్టు సంఘంలో ఉద్యమ వాతావరణం క్రమంగా కల్పించవచ్చు నేమో అనుకొన్నాను. అది కేవలం భ్రమ మాత్రమే అని అనతి కాలంలోనే అర్థం చేసుకొన్నాను. వివరాలు అప్రస్తుతం.

* * *

పోతే 1982 నవంబరులో 'రాడికల్ హ్యూమనిస్టులు పునర్జన్మ ఎత్తాలి' అనీ, ఆ మరుసటి నెలలో 'పార్టీ × ఉద్యమం' అనీ 'రాడికల్ హ్యూమనిస్ట్' మాస పత్రికల్లో సంపాదకీయాలు రాశాను. ఈ రెండు సంపాదకీయాలు ఆంధ్రప్రదేశ్ రాడికల్ హ్యూమనిస్టు సంఘంలో సంచలనాన్ని సృష్టించాయి. నిజానికి యీ సంపాదకీయాలు చూచి కంగారు పడవలసిన కారణ మేమిటో యీనాటికీ నాకు అర్థం కాని విషయం. ఇవి నా 'కలలో దేవుడు' అంతర్యాన్ని ప్రతిబింబించేవే. అందుకే వాటిని పాఠకుల పరిశీలనార్థం గ్రంథాంతంలో యథాతథంగా ఇస్తున్నాను.

1962 లో నేను రాసిన 'కలలో దేవుడు' అసలు కాపీ పోయింది. చిత్తు కాపీలో మొదటి పేజీలు కొన్ని మాత్రమే దొరికాయి. అందుచేత ఈ ప్రస్తుత రచనలో చాలవరకు నా జ్ఞాపకశక్తి మీద ఆధారపడవలసి వచ్చింది. కనుక తొలి రచనలోని స్వచ్ఛందత దీనిలో వచ్చి వుండటానికి వీలులేదు. రచనకు మరికొంత వ్యవధి వుంటే బాగుండేది. అయినా వృత్త పరిధికి మొదలెక్కడ? పరిపూర్ణతకు తుద యెక్కడ? ఏమైనా నేను ప్రస్తుతానికి మానవవాద మార్గంగా భావిస్తున్న రాయిస్టు పంథాకు కొంత వెలుగును వెదజల్లగలదన్న నమ్మకంతో యీ రచనను ప్రచురించి ఎమ్. ఎన్. రాయ్ శత జయంతి సందర్భంగా ఆయనకు నా చిరుకానుకగా సమర్పించు కొంటున్నాను.

◆ ◆ ◆

ప్రచురణకు పూర్వం ఈ రచనను త్రిపురనేని వెంకటేశ్వరరావు (వేమన వికాస కేంద్రం, విజయవాడ) గారికి, డాక్టర్ జి. వి. స్వామి - డాక్టర్ సూర్యకుమారి (హైదరాబాదు) గార్లకూ చదివి వినిపించాను. ఉన్న స్వల్ప వ్యవధిలో అనేక కార్యభారాలమధ్య వుండి కూడ విని కొన్ని అమూల్యమైన సలహాలిచ్చారు; వారికి నా ధన్యవాదాలు.

డాక్టర్ పావులూరి కృష్ణచౌదరి, బి. సిహెచ్. వి. సుబ్బారావు (హిందూస్తాన్ పవర్ ఎలక్ట్రానిక్స్, హైదరాబాద్) గారలు గ్రంథ ప్రచురణ బాధ్యత, ఆవిష్కరణ కార్యబాధ్యత స్వీకరించారు. వారికి నా కృతజ్ఞతలు.

ఆంధ్రప్రదేశ్‌మంచి అఖిలభారత రాడికల్ హ్యూమనిస్టు సంఘ అధ్యక్షులుగా వరుసగా నాలుగేళ్ళు కొనసాగిన గౌరవం దక్కించుకొన్న లోకాయుక్త జస్టిస్ ఆవుల సాంబశివరావుగారు రాడికల్ హ్యూమనిస్టు సంఘ దృష్టిని వ్యతిరేకించే యీ గ్రంథాన్ని హైదరాబాదులో ఎమ్. ఎన్. రాయ్ శతజయంతి (21-3-1987) నాడు ఆవిష్కరించటానికి అంగీకరించారు. భేదాభిప్రాయాల పట్ల వారి సహిష్ణుతను శ్లాఘించకుండా ఎలా వుండను?

తమకున్న స్వల్పమైన వనరులలో అతి స్వల్పమైన వ్యవధిలో ఈ పుస్తక ముద్రణము సొంతపనిగా భావించి పూర్తిచేసి యిచ్చిన లిబర్టీ ప్రింటర్స్ (చీరాల) వారికి కూడ కృతజ్ఞతలు తెల్పటం నా ధర్మం.

చీరాల
13-3-87

- ఎస్. ఏ. బ్రహ్మం
మనీషా విద్యావిహార్

---

ఉన్నతాంశాలుగా ఎన్నదగిన వెన్నో మానవ జీవితంలో వున్నై. వాటిని గణనలోకి తీసుకోకుండా వుండదు పదార్థ వాదం; కాకపోతే మానవ జీవితంలో ఆధ్యాత్మికాంశాలుగా పేర్కొబడే వేవీ యీ ప్రపంచాన్ని అధిగమించి వుండవనీ జీవధర్మ సత్వమైన మానవునిలో అవి స్వభావతః వుంటా యనీ మాత్రం అంటుంది. మానవుడు బౌద్ధికంగా వృద్ధిచెందే కొద్దీ అతని జ్ఞానం విస్తృత మవుతుంటుంది; అంతేకాక అతనిలో అంతర్గతంగా వుండే ఉన్నత విలువలూ భౌతిక అస్తిత్వానికి భిన్నమైన ఇతర విషయాలలో ఆసక్తి చూపగల శక్తి సున్నితమైన సంవేదనలు, కళలు, శాస్త్రం మొదలైన వాటి అనుష్ఠానమూ క్రమాధికంగా సాధ్యపడుతుంటాయి.

- ఎమ్. ఎన్. రాయ్.

# కలలో దేవుడు

సముదాయంపట్ల చూపే అనురాగమే అత్యున్నతమైన అనురాగ మనుకోవటం తప్పు. మనం మన సొంత అంతఃకరణం వల్ల సొంతస్వేచ్ఛ పట్ల అనురక్తులంగా వుందాం. మిగతా మనుషులందరితోబాటు మన అంతఃకరణానికి మన స్వేచ్ఛకూ సర్వసామాన్యమైన అనుబంధాన్ని కనుగొన్నాం. కనుక నిజానికి యీ స్వానురాగా లెన్నడూ సంఘర్షణకులోనుకావటం సంభవించదు. అయితే ఆచరణలోనూ అనుభవం ద్వారానూ తప్ప ఏ భావాలూ రుజువుకావు. మన భావాల సమగ్రమైన సమర్థమైన స్వేచ్ఛాతత్వంగా నిరంతరం పెంపు సొంపులు నింపుకోవడానికి దోహదమవుతూ వుండేది ఆచరణలో మనం పొందే అనుభవమే.

- ఎమ్. ఎన్. రాయ్.

ఆది 1962 ఆరంభం. సాధారణ ఎన్నికల సమయం. కొందరు రాడికల్ హ్యూమనిస్టు ప్రముఖుల మధ్య ఎన్నికలలో తమ పాత్రను గూర్చి చర్చ జరిగింది. తాత్కాలికంగానే కావచ్చు—మౌలికమైన అభిప్రాయ భేదాలు తలెత్తినై. వేడి వేడిగా సాగిన చర్చల వల్ల 'వేడెక్కిన బుర్రతో ఇల్లు చేరాను. తలపుల బరువు మూలంగా తెలియకుండానే నిదుర పట్టింది.

* * *

తళుక్కున మెరుపు మెరిసి నట్లయింది. మెరిసిన మెరుపు చెరిగిపోలేదు. ఏవో మాటలు వినిపించినై. మాటాడే మూర్తి కోసం వెదికాను. కాని మూర్తి దర్శనం కాలేదు నాతో నేనే మాట్లాడు కొంటున్నానా అనిపించింది.

"ఎవరు నువ్వు?" అన్నాను.

"తెలియని వాళ్ళు దేవు డంటారు" — సమాధానం.

నేను: తెలిసిన వాళ్ళేమంటారో కూడ సెలవియ్యండి!

దేవుడు: ఆ విషయం చెప్పటానికే వచ్చాను.

నే ; ఎక్కడి మంచి?

దే : ఎక్కడి మంచేమిటి? నీలో మంచే.

నే ! నాలో మంచా? అబద్ధం. నాకు తెలియకుండా నాలో ఇంత వెలుగుఎక్కడుందంటావు?

దే : అదే నీవు తెలుసుకో వలసింది. ఈ వెలుగంతా నీవుకాదా? నీవుఅంటే నేను కాదా?

నే : మళ్ళీ ఏదో మోసం చేయుటానికే వచ్చినట్లున్నావు!

దే ! మోసమా? నిన్ను ఒకరు మోసం చేయుటనేమిటి? ఏదైనా మోసం జరిగితే అది నిన్ను నీవే చేసుకొంటున్నావు.

నే ! ఒకనాడు నిన్ను నేను ఒక ప్రయోజనం కోసం సృజించాను. నా సృష్టివైన నీవు సృష్టికర్తనైన నన్నే కబళింప చూస్తూ వచ్చావు. ఇది మోసం కాదూ?

దే : నన్ను నీవు సృజించట మేమిటి? నీవు వేరూ నేను వేరూ అయితే కదా!

నే : నీవూ నేనూ ఒకటి కావటం అసంభవం. నీ గుణాలు వేరు; నా గుణాలు వేరు; నాలోలేని సర్వజ్ఞత్వాన్ని నీకు ఇచ్చాను; నాలోలేని సర్వవ్యాపకత్వాన్ని నీకు ఇచ్చాను. నాలో లేని సర్వశక్తిమత్తను నీకు ఇచ్చాను. అందుకేగా నా సృష్టివైన నీవు నాపై కసి తీర్చు కొంటున్నావు!

దే ! నా గుణాలు నీలో లేనివే అయితే వాటిని నాకివ్వటం ఎలా సంభవం? నా గుణాలన్నీ నీ గుణాలే. కాని పక్షంలో—నన్ను నీ రూపంలో సృజించి నట్లు గొప్పలు చెప్పుకుంటావే, దాని కర్థమేమిటి?

నే : నాలో లేని అనర్ఘ గుణాలను నా కాపాదించి, ఏదో విధంగావుబ్బించి వంచించాలని చూస్తున్నావు. నా అజ్ఞానం నుంచి ఉత్పన్నమైన ఊహగా తప్ప నీకు వేరే అస్తిత్వంలేదు. ఈ సత్యాన్ని నే నేనాడో గుర్తించాను. కనుక ఇక నన్ను ఏ మాత్రం వంచించలేవు.

దే ! ఏమిటీ వైరుధ్యాలు? ఒకవంక నేను నీ సృష్టినే అంటావు; మరో వంక నా గుణాలు నీవి కావంటావు; ఇంకో వంక నేను అజ్ఞాన జనితమైన నీ వూహనే అంటావు. అసలు అజ్ఞాన మేమిటి?

నే : జ్ఞానం కానిదే అజ్ఞానం! తెలిసింది జ్ఞానం; తెలియంది అజ్ఞానం.

దే ! బలే! బలే, తెలియంది అంటూ నీకు కూడా ఒకటున్నాదా యేంటి?

ఫలానా ఇది తెలియంది అనుకునేసరికి అది తెలిసిందే అవుతుంది. అందువల్ల వున్నదంతా జ్ఞానమే కాని, అజ్ఞానమన్నదిలేదు. ఒకవేళ వుంటే—అది, అజ్ఞానంగా నైనప్పటికీ, గుర్తింపబడే సరికే జ్ఞానమై కూర్చుంటుంది. ఇంక అజ్ఞాన మెక్కడ?

నే: ఎంత తెలుసుకున్నా తెలుసుకో వలసింది ఇంకా మిగిలి వుంటుంది కదా! అది ఈ నాటికి అజ్ఞాన మనుకోక యేమనుకోవాలి?

దే: తెలుసుకో వలసింది ఎప్పుడూ మిగిలి వుండే మాట నిజమే. కాని తెలుసుకొన్నదీ జ్ఞానమే: తెలుసుకో వలసింది మిగిలి వుంటుందనుకోవటమూ జ్ఞానమే; ఇప్పుడు తెలుసుకొనేదీ జ్ఞానమే; ఇంకా తెలుసుకో వలసిందీ జ్ఞానమే. నీవు జ్ఞానం నుంచి జ్ఞానానికే పోతున్నావు; అంతేకాని అజ్ఞానంనుంచి జ్ఞానానికి పోవటంలేదు. జ్ఞానంనుంచి జ్ఞానానికి పోతూ నిన్ను నీవు తెలుసుకొంటున్నావు. నిన్ను నీవు శోధించగా తెలుసుకునే యీ ఉద్యమంలో అజ్ఞానానికి తావెక్కడ?

నే: అయితే ఆదిమ మానవునికి నాకూ తేడా లేదనేనా నీవనేది?

దే: నీ అహంకారమే నీకు ముప్పు తెస్తున్నది. ఆదిమ మానవునికి నీకూ వస్తుతః ఏమీ తేడాలేదు. జ్ఞానం ధారావాహికం. అది ఒక నది లాంటిది. సన్నటి సెలయేరుగా ప్రయాణం ప్రారంభిస్తుంది. క్రమేపి ఎన్నో సెలయేళ్ళను కలుపుకొని విశాలమవుతూ చివరకు సువిశాలమైన సముద్రంలో లీనం కావటానికి యాత్ర సాగిస్తున్నది. ఈ యాత్ర అంతం లేనిది. అయినా సముద్రం ఎంత సత్యమో నది కూడా అంత సత్యమే. నది ఎంత సత్యమో సెలయేరు కూడా అంత సత్యమే. ధారా వాహికమైన జ్ఞానానికి తద్విషయమైన సత్యమే గమ్యం. కనుక అడుగడుగునా ఆర్జించబడే జ్ఞానం సత్యభాగంగా సాపేక్షసత్యం అవుతుందే తప్ప అజ్ఞానం మటుకు కాదు. ఆదిమ మానవుడి నుంచి వేరై ఇప్పుడు నీవు చేరుకొన్నట్లు భ్రమిస్తున్నది నీకు విడిది అనుకొంటున్నావా? నీ ప్రయాణం విడిది లేనిది; దాని గమ్యం అనంతం. ఉనికికి భిన్నమైన భావనగా గమనం ఎలా భ్రమ జనితమో, అలాగే జ్ఞానానికి భిన్నమైన భావనగా అజ్ఞానం కూడా భ్రమ జనితమే. అనంతమైన వస్తువుకు అరలు కల్పించ చూడటంలో అర్థం వుంది? ఒకప్పుడు నీవు అజ్ఞాని వనుకుంటే—గమ్యం ఎరుగని నీ ప్రయాణ మార్గంలో ఇప్పుడూ అజ్ఞానివే; ఎప్పటికీ అజ్ఞానివే.

నే : నీ వుపన్యాసం గొప్పగా వుంది! ఒక్క సందేహం. ఒకనాడు నిన్ను నేను సృజించాను; ఈనాడు నిరసిస్తున్నాను. సృజింపడమూ, నిరసించడమూ, రెండూ పరస్పర విరుద్ధ క్రియలు. అయినా అవి రెండూ జ్ఞాన ప్రేరితాలే అంటావు. అంతేనా?

దే : మళ్ళీ మొదటికే వచ్చావు. అసలు నీవు ఇక్కడ వ్యత్యేకంగా ఒకరిని సృజించటమూ లేదు; నిరసించటమూ లేదు. నిన్ను నీవే నీ కోసమే సృజించుకొంటున్నావు; నిరసించుకొంటున్నావు. శూన్యం కూడా ఒక రకమైన ఉనికి ఎలా అవుతున్నదో ఆలాగే నిరసన కూడా ఒకరకమైన సృష్టి అవుతుంది. ఈ రెండు క్రియాలూ జ్ఞాన ప్రేరితాలే. కాబట్టి నేను నీతోనే పుట్టి, నీతోనే పెరిగి, నీతోనే నశిస్తాను. నిన్ను విడిచి యెక్కడో లేను నేను.

నే : అదంతా వట్టి బూటకం. నిన్ను గుర్తించినంత కాలం నన్ను నేను మరిచి పోయాను; నా విశ్వాసానికి నిన్ను కేంద్రం చేసి, నన్ను నీకు అర్పణ చేసుకొన్నాను. నిన్ను నిరసించిన తర్వాత ఎంత హాయిగా వున్నదంటావ్! నా అనుభూతిలో గల యీ భేదం అబద్ధమా?

దే : నన్ను నీకు బయట భావించు కోవటం వల్లనే యీ భేదం వస్తున్నది. విశ్వాసం లేనిదే మనిషి బతక లేడు. అందుకే నీవు ఆలోచించటం నేర్చుకొన్న కొద్ది కాలానికే ఆధ్యాత్మిక వాదంలో పడ్డావ్. నీ అసహాయతను నీవు గుర్తించినప్పుడు నేను నీ విశ్వాసానికి పాత్రుణ్ణయ్యాను.

నే : అంటే నేను నా అసహాయస్థితిని అధిగమిస్తే గాని నీవు నశింపవన్న మాట?

దే : అలాంటప్పుడు నా అవసరం నీకు వుండదు గదా. లేనప్పుడు నశింపక ఏం చేస్తాను? నశించి నీలో లీనమవుతాను. అప్పుడు సర్వం నీవే అవుతావు.

నే : ఏమిటో? నీవు చెప్పేదంతా అయోమయంగా వుంది. అసహాయ స్థితిని అధిగమించటం సాధ్యమా?

దే : సాధ్యం కాకేమి? అలా అధిగమించిన వాళ్ళే తమకు తాము కర్తలుగా జ్ఞాతలుగా, ప్రమాతలుగా, నేతలుగా అనుభూతి పొందగలిగారు. అలాంటి వాళ్ళే చరిత్రను సృజింపగలిగారు. వారిలో ఎవరైనా నన్ను బాహ్యశక్తిగా భావించి ఆరాధించివుంటే వారి ఆరాధన కేవలం లాంఛన ప్రాయం; నాపై వాళ్ళకుగల విశ్వాసం వాళ్ళ ఆలోచనకూ, సంకల్ప

జలానికీ, కార్యదక్షతకూ అడ్డురాలేదు. నీవూ అలాగేమారి నీ విశ్వాసాన్ని అన్య విశ్వాసంగా మార్చుకో గలిగినప్పుడు నేను లేను. అలా జరగ నప్పుడు భ్రమజనితమైన పెనుభూతంలాగా నిన్ను భయపెడుతూ నీ వల్ల కాన్కలు పొందుతునే వుంటాను.

నే : నీవు నన్ను భయపెట్టేదేమిటి? అసలు నీలో నాకు విశ్వాసముంటేగా? ప్రాచీన భౌతికవాదులే నీ సంగతి ఏనాడో తేల్చారు; ఏమైనా కొరవా దరవా వుంటే ఆధునిక విజ్ఞానం అకాస్త పూర్తి చేసింది. ఈ ప్రపంచంలో నీకింకా చోటెక్కడ?

దే : నీవు పొరపడుతున్నదే అక్కడ నే నంటే యేమిటో బొత్తిగా నీ బుర్ర కెక్కటం లేదు. నేనంటే ఏదో ఫలానా అనుకొన్నావు. ప్రకృతికి బాహ్యం గానో, నీకు బాహ్యంగానో వున్న ఒక పరాశక్తి నమకొన్నావు. అలాంటి శక్తిగానైతే విజ్ఞానం నన్ను మట్టుపెట్టినమాట నిజమే కావచ్చు. మత స్థులు కల్పించిన శక్తిగా మటుకు నా పరాజయాన్ని నేనంగీకరిస్తాను ఆ రూపంలో నే నేనాడో నశించాను; అంతేకాని అసలైన నేను నశించ లేదు.

నే : నాకేమీ బోధపడటంలేదు మతస్థులు కల్పించిన శక్తిగా నశించట మేమిటి? అసలు నీవు నశించక పోవటమేమిటి?

దే : ముఖ్యంగా నీవు అర్థం చేసుకోవలసిందే అది. నేను నీ పరిమిత జ్ఞానం నుంచీ, నీ నిస్సహాయస్థితి నుంచీ పుట్టిన నీ ప్రతిబింబాన్నే అని మరచిపోకు. నా పుట్టుకకు కారణం అలాగే వున్నంతవరకు నేనెలా నశి స్తాను? కారణ కార్యాల మధ్య ద్వైతం లేదన్నసంగతి నీకు తెలియదా? నీ అసహాయస్థితి నీలో చెదరకుండా వున్నంతవరకు-నేను దేవుడి రూపంలో రూపుమాసిపోయినా, మరో రూపంలో నిన్ను అంటిపట్టుకొనే వుంటాను ఇప్పుడుంటున్నాను కూడా; ఆ సంగతి నీకుతెలుసా?

నే : ఇంకా ఇప్పుడుకూడా నన్ను అంటిపట్టుకొనే వుంటున్నావా? అబద్ధాని కైనా ఒక హద్దూ పద్దూ వుండొద్దూ?

దే : నీ బుద్ధి నీ హద్దులో వుంటే నాది అబద్ధమో నిబద్ధమో అర్థమవుతుంది. ఒక విషయం కాస్త శ్రద్ధగా ఆలోచించు. నీవు మత భావాలతో నిండి వున్ననాడు నేను నేనిచ్చిన హాయిని మరచిపోయావు. నీవు ఆనాడు పొందిన హాయికీ, యీనాడు పొందుతున్న హాయికీ వ్యత్యాస మున్న దనుకొంటున్నావు కదూ? అదే భ్రమ ... ఈనాడి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం
A C. No. 89591

హాయి—ఒక నిస్సహాయుడు పర సహాయంలో పొందే తృప్తికి వినా మరేమీకాదు.

నే : నీ వనుకొంటున్నట్లు నేను యీనాడు నిస్సహాయస్థితిలో వున్నాననీ, పర సహాయం అర్థిస్తున్నా ననీ యెవరు చెప్పారు?

దే : ఒకరు చెప్పేదేమిటి? నాకు తెలియదనుకొన్నావా? ఇప్పటికీ నీ స్థితిలో మార్పురాలేదు. అందుకుకదా, మతతత్వాన్ని వదలటంవల్ల కోల్పోయిన హాయిని పూడ్చుకోటానికి—అంతకంటె మత్తెక్కించే పార్టీ తత్వాన్ని పట్టావు. కాకపోతే—నన్ను మతంలో చూడటంమాని, పార్టీలో పార్టీ నాయకత్వంలో చూచుకొంటున్నావు. పాపం, నీకా సంగతి తెలియదు.

నే : తెలియక పోవట మేమిటి? పార్టీలు పోవాలనీ, పార్టీ రహిత ప్రజా స్వామ్యం కావాలనీ, సమష్టితత్వం స్థానే వ్యష్టితత్వం రావాలనీ- ఆలో చనలుచేసి మేము పార్టీని రద్దు చేసుకొన్న సంగతి నీకు తెలియదా?

దే : పార్టీ నయితే రద్దు చేసుకొన్నావు. కాని తర్వాత నీవు చేస్తున్న దేమిటి? పార్టీ పోయినంతమాత్రాన పార్టీతత్వం పోయిందని భ్రమి స్తున్నావు. మతతత్వం వెనక, పార్టీతత్వం వెనక పొంచివున్న సమష్టి తత్వం నీ నిస్సహాయస్థితికి రూపాంతరం. అది అంత తేలికగా పోయే దనుకొంటున్నావా? సమష్టితత్వం చాటున దాగివున్న మానసిక వాతా వరణం మారనిదే—అది మరొక రూపంలో వ్యవస్థీకరణం చెందితీరు తుంది. సమయం చూచుకొని దాని అసలు రంగుతో బయటపడి తీరుతుంది.

నే : ఇప్పుడు మాకు ఏ రకమైన సంస్థాలేదే. కాకపోతే ఒకే అభిప్రాయాలు కల వ్యక్తుల్ని కూడగట్టటానికి ఒక సంఘాన్ని నెలకొల్పాలని వుద్దే శించాం. మాకున్న భావాలు మేమే ఆచరించాలని లేదు; ఎవరు ఆచ రించినా ఒకటే.

దే : ఇంతవరకు ప్రతిసంస్థా ఇలాంటివే ఏవో కొన్ని సదుద్దేశాలతోనే ప్రారంభమయింది. కాని ఆచరణలో ప్రతిదీ తన ఆదర్శానికి వ్యతిరేకం గానే నడిచింది. మీరు యీనాడు నెలకొల్పుకొంటున్న సంఘం మటుకు అందుకు భిన్నంగా సాగుతుందని నీకు నమ్మకమా?

నే : నమ్మకమా ఏమిటి? గట్టి నమ్మకం. అందుకు కారణం లేకపోలేదు. ఇతర సంస్థలు ముందుగా కొన్ని ఆదర్శాల నేర్పరచుకొని, ఆ ఆదర్శాల

చుట్టూ సభ్యుల్ని కూడగట్టుకొంటూ వచ్చినై. మేము అలాకాదు. ఆదర్శాలుకల వ్యక్తులం ఒక ప్రయోజనం కోసం ఒకచోట చేరుతున్నాం.

దే: పోనీ, చేరిన తర్వాతనైనా మీ సంఘానికి నీవనుకొన్న ప్రయోజనాన్ని ప్రతిబింబించే సమష్టి ఆదర్శం యేర్పడటం లేదూ? దాన్ని చుట్టుకొని మసలటానికి నిర్ణయించుకొనే కొత్తసభ్యుల్ని మీ సంఘం మటుకు తనచుట్టూ కూడగట్టుకోదూ? అలాంటప్పుడు మీ సంఘంలో విశేష మేముంది?

నే: విశేషముంది. మిగతా సంస్థలకూ మా సంస్థకూ ఒక ముఖ్యభేదముంది. ఇతర సంస్థలలో సభ్యులమధ్య సంబంధాలు ఐకమత్యం ప్రధానంగా వుంటై. అక్కడ భిన్నమతాలకూ, భిన్నాభిప్రాయాలకూ తగినంత చోటుండదు; కనుకనే అవి క్రమేణ నియంతృత్వ సంస్థలుగా రూపొందుతూ వచ్చాయి. కాని మా సంస్థకు ఐకమత్యం ప్రధానంకాదు. ఇక్కడ భిన్నమతాలకూ భిన్నాభిప్రాయాలకూ తావుంది. మా మధ్య సంబంధాలు సహకారం ప్రధానంగా వుంటై.

దే: సహకార మంటేయేమిటి? సర్వతంత్ర స్వతంత్రులైనవ్యక్తులు తాత్కాలికమైన ఒక ప్రయోజనం కోసం నిమిత్తమాత్రంగా కలియటమేకదా సహకార మంటే? ఈ కలయిక నిమిత్తమాత్రం కాకుండా క్రియాప్రధానమైనప్పుడు నిర్దిష్ట క్రియను ప్రేరేపించటానికి భావైక్యత అవసరమవుతుంది. ఇప్పుడుచెప్పు— మీ సంఘం నిమిత్తమాత్రమా? లేక క్రియా ప్రధానమా?

నే: మాకు ఒక నిర్దిష్ట కార్యక్రమం వున్నమాట నిజమే. కాని మా కార్యక్రమం వ్యక్తివికాస విశిష్టమై నిర్దుష్టమైనది. నేనూ, నాలాంటి మరి కొందరు వ్యక్తులూ విడి విడిగానూ కలిసి కట్టుగానూ ఆలోచించి యీ కార్యక్రమం సజావుగా వున్నదని గుర్తించి నిజాయితీతో సంఘం కట్టాం. మేమంతా మొదట జిజ్ఞాసువులమే కనుక మా కలయిక, నిమిత్తమాత్రం కాక పోయినా, సహకార ప్రధానమైనదే అనుకోవాలి.

దే: నిర్దుష్టం, సజావు, నిజాయితీ—లాంటి పదజాలం అన్ని సంస్థల మనుషులూ ప్రయోగించేవే. అది అలావుంచుదాం. అసలు సహకారాని

కైతే సంఘం దేనికయ్యా? వ్యక్తిని చేసేది ఆలోచన; సంఘాన్ని చేసేది ఆచరణ.

నే : ఆలోచించే వ్యక్తులే సంఘం కట్టితే—ఆలోచనా, ఆచరణా ఒకదానితో ఒకటి చేతులుకలిపి పయనించవూ?

దే : అలా జరగదు. సంఘం యొక్క ఆచరణకు దోహద మయ్యేది ఒక రిద్దరు పెద్ద తలల ఆలోచనలే. ఆ ఆలోచనలు తీర్మానాల రూపంలో వెలువడతాయి. ఒక నిర్దిష్ట ప్రయోజనాన్ని ఆకాంక్షించి వచ్చే సభ్యుల మనసులకు ఆ తీర్మానాలు సహజంగా నచ్చుతూ వుంటాయి. ఒకరిద్దరి నిర్ణయాలు పదిమంది పేర ప్రకటింప బడతాయి. పార్టీ సమావేశాలలో మటుకు జరిగేది చాలవరకు ఇంతేకదా?

నే : పార్టీనీ మా సంఘాన్నీ ఒకే గాటను కట్టివేయ పూనటం అన్యాయం. పార్టీలలో నాయకుల అభిప్రాయాలు సభ్యులపై బలవంతంగా రుద్ద బడతాయి. సభ్యుల మనసులు నొచ్చినా ఆ అభిప్రాయాలను వారు గొర్రెదాటుగా అమలరిస్తూ వుంటారు. కాని మా విషయంలో అలాకాదు. పెద్దలే—తెలిసిన వారు కనుక—తమ అభిప్రాయాలు ప్రతిపాదించ వచ్చుగాక. కాని అవి మా సంఘీయుల కందరికి నచ్చటం ముఖ్యం.

దే : పార్టీలలో క్రమశిక్షణ పేర నాయకుల అభిప్రాయాలు సభ్యుల మీద రుద్దబడే మాట నిజమే. అయినా ఆ అభిప్రాయాలు భరింపరానివైన ప్పుడు పార్టీ సభ్యులు మటుకు తమ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చి పార్టీ నుంచి వైదొలగటం లేదా? మీ సంఘం సభ్యులలో మటుకు క్రమశిక్షణ పనిచేయుటం లేదూ? క్రమశిక్షణ అన్నది బలవంతం మీదనే సాగవలసిన పనిలేదే. ఆమోద లక్షణమే కదా దానికి మూలం? ఉదా హరణకు హిందూసంఘం లోని వర్ణ వ్యవస్థను చూడు. దాన్ని ఈనాడు ఎవ్వరూ పైనుంచి శాసించటం లేదు అయినా వర్ణ వ్యవస్థ క్రమశిక్షణ బద్ధంగా సాగిపోతూనే వుంది. కారణం?

నే : అందుకు కారణం అలవాటుకు లోనయ్యే మూక మనస్తత్వం. నీవన్నట్లు గుడ్డిగా సాగిపోయే ఆమోదగుణం. కాని మా సంఘాన్ని అలాంటి మనస్తత్వం పాలించటం లేదే. వర్ణ వ్యవస్థ నచ్చి ఆచరించేది కాదు. కాని మా తీర్మానాలు ఆమోద యోగ్యాలు కబోయే ముందు మాకు నచ్చాలని చెప్పాను.

దే : నీవు పొరపడుతున్నావు. వర్ణ వ్యవస్థ హిందువులకు నచ్చినిదే అయితే ఇంత నిరాటంకంగా సాగిపోయేదికాదు. కనుక ఏదో ఒక రూపంలో నచ్చట మనేది ఆలోచనా పూర్వకమే కానవసరం లేదు. పెద్దల అభిప్రాయాలు సంఘ సభ్యులకు నచ్చుతున్నవి అంటే అందుకు కారణాలనేకం. అవి తన ఆలోచనకు సరిపోవటం కావచ్చు. ఆ పెద్దల అభిమానానికి పాత్రుణ్ణి కావాలన్న కండూతి కావచ్చు; ఆ పెద్దల పట్ల తెలియకుండా ఏర్పడే భయభక్తులు కావచ్చు; ఆ పెద్దలతో గల ప్రగాఢ స్నేహం కావచ్చు. రాజుగారు తప్పు చెయ్యరన్నట్లు ఆ పెద్దల పట్ల యేర్పరచుకొన్న అంధ విశ్వాసం కావచ్చు; పరస్పర ప్రచారం కోసం ఒకరి కొకరు మెప్పుదలను ఇచ్చి పుచ్చుకొనే అవగాహనతో కూడిన ఒప్పుదల కావచ్చు; మరో మార్గం చూపలేని అశక్తత కావచ్చు; ప్రతి దానికీ ఊఁకొట్టే బసవన్న మనస్తత్వం కావచ్చు; సంఘం నుంచి వేరయితే ఏకాకినై పోతానేమో అన్న జంకు కావచ్చు; మరేమైనా కావచ్చు. కాబట్టి నచ్చటం, ఆమోదించటం అన్నమాటలు చాలవరకు మనుషులు తమ సౌకర్యం కోసం వాడుకొనే ఊత పదాలే.

నే : అయితే మా సంఘానికి పార్టీకి తేడా లేదంటావు. అంతేగా. మరి దీని కేమంటావు? పార్టీలకు అధికారమే ఆశయం; అధికారాన్ని నిరసిస్తాం మేము.

దే : మాటి మాటికి మేము - మేము అంటావు; మళ్ళీ మాది సమష్టి ముఠా కాదంటావు. 'మేము' భాష తప్ప 'నేను' భాష మాట్లాడటం చేత కాదా నీకు?

నే : 'మేము' అనేది ఏదో లాంఛనంగా అలవాటుగా అన్న మాటే తప్ప మరేమీకాదు. నేను వ్యక్తి ప్రధాన వాదిని. నేను అధికారాన్ని నిరసిస్తాను.

దే : నీవు అధికారాన్ని నిరసించటమెందుకు? అధికారాన్ని నిరసించటమంటే సోమరితనాన్ని బుద్ధి పూర్వకంగా వరించటమే కదా?

నే : నీ వరస బాగుంది; కాలికి వదిలితే వేలికి వేలికి వదిలితే కాలికి వేస్తావు. పార్టీ పనికి రాదంటావు; అధికారం వుండాలంటావు?

దే : ఏమి పరిజ్ఞాన మయ్యా నీది? వ్యష్టి - సమష్టి— ఈ రెండిలో బతికేది ఒకటే. పార్టీ సమష్టి తత్వం; కనుక అది ప్రాధాన్యం వహించిన

మేరలో వ్యక్తికి పుట్టుగతులుండవు. అందుచేత వాస్తవమైన వ్యక్తి బతికి బట్టకట్టాలంటే మిథ్యాసమష్టియైనపార్టీ అంతరించకతప్పదు కదా?

నే : మరి అధికారం వుండాలంటున్నావు కదా? పార్టీతత్వం, సమష్టితత్వం లేకుండా అధికారం ఎలా వుంటుంది?

దే : ఓహో! అదా నీ సందేహం? అయితే అసలు అధికారమంటే ఏమిటో నీకు సరైన అవగాహన లేదన్నమాట. అధికారమంటే కార్యకరణ శక్తి; పని చేయగల చేవ. ఎప్పుడైనా ఎక్కడైనా పని చేసేది వ్యక్తే కాని పార్టీకాదు. తమాషా యేమంటే పార్టీ విధానంలో ఆయా పార్టీ మనుషులు విడివిడిగా చేసే పనులన్నిటిని పార్టీకాతాలో జమ పెడుతూవుంటారు. అందువల్ల మిథ్యాభావన అయిన పార్టీ పేర నాయకత్వం తన నాశ్రయించిన వ్యక్తుల శక్తి సామర్థ్యాల్ని మేసి బలిసి పోతుంది. తమ కార్యకరణ సామర్థ్యాన్ని గౌరవ ప్రతిష్ఠల్ని బుద్ధిపూర్వకంగా ఆ సమష్టి మిథ్యకు ధారాదత్తం చేసుకొన్న వాస్తవవ్యక్తులు బక్కచిక్కి శల్యావశిష్టులై పోతారు. కనక వ్యక్తి ఇలాంటి ప్రమాదానికి బలికాకుండా వుండాలంటే, అర్హతను సూచించే అధికారం వ్యష్టిని ఆశ్రయించి వుండాలి. సమష్టిని ఆశ్రయించి వుండేది అధికారం కాదు; సర్వాధికారం —అంటే పరధిక్కారం. అందుకే అధికారాన్ని నిరసించటం తప్పు అంటున్నాను.

నే : అయితే సీజర్లూ, నెపోలియన్లూ, హిట్లర్లూ వ్యక్తులు కారా? వారు తమ అధికారం వ్యక్తిగతంగానే చలాయించారు కాబట్టి అది సమర్థనీయమనా నీవనేది? అంటే వ్యక్తి అధికారమైన నియంతృత్వం వర్ధిల్లా లంటావు?

దే : వారు చలాయించిన అధికారం వ్యక్తిగతమని ఎవరన్నారు? అది సైనిక బలాన్నో జాతితత్వాన్నో పార్టీ తత్వాన్నో ఆధారంచేసుకొని బతికిన సర్వాధికారమే కాని కేవలం వారి వారి ప్రతిభా విశేషం మీద ఆధారపడిన వ్యక్తి అధికారం కాదు. గౌతమబుద్ధుడు, అల్బర్ట్ ఐన్‌స్టైన్ లాంటి వాళ్ళను వ్యక్తి అధికారానికి ఉదాహరించుకోవచ్చు. వారిది జ్ఞానశక్తి. అదే అసలైన అధికారశక్తి. కార్యదక్షతను ప్రేరేపించేది అదే. ఈ జ్ఞానశక్తి ఒకరికి త్యాగం చేయబడేది కాదు; ఒకరి త్యాగ ఫలాలను దేబిరించేదికాదు. ఒక వ్యక్తిలోని జ్ఞానశక్తి మిగతా వ్యక్తులలోని జ్ఞానశక్తులను నిరాదరించదు. కనుకనే ఒక వ్యక్తిలోని అధికారశక్తి మిగతా వ్యక్తులలోని అధికారశక్తుల్ని గౌరవిస్తుంది. అలాంటి

వాతావరణంలో వ్యక్తులమధ్య స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం నెలకొని వుంటాయి. అదే ప్రజాస్వామ్యానికి గీటురాయి. కాని నీవు పేర్కొన్న నియంతల అధికార శక్తులు మిగతా వ్యక్తుల అధికార శక్తులను తృణీకరించాయి. నిజం చెప్పాలంటే వారు చలాయించింది పరధిక్కారమేకాని స్వాధికారం కాదు. ప్రజాస్వామ్యానిది వ్యష్టి విశిష్టమైన స్వాధికారమైతే నియంతృత్వానిది సమష్టిజుష్టమైన పరధిక్కారం. కాబట్టే నియంతలు సౌజన్య ప్రేరితులైన అధికారులుకాక, ప్రజలపాలిట దౌర్జన్య పూరితులైన అధిక-అరులు అవుతుంటారు.

నే: అయితే మేము ఎన్నికల్లో నిలబడటం, అధికారాన్ని ఆశించటం తప్పు కాదన్నమాట.

దే: నీవన్న దాంట్లో రెండు తప్పులున్నాయి. ఒకటి—ఎన్నికల్లో నీవు నిలబడవచ్చు; మీరు నిలబడకూడదు. నీ బుద్ధి సమష్టితత్వపు పంకెళ్ళను తెంచుకోలేకపోవటంవల్ల యీ తప్పు దొర్లింది. రెండు-నేను చెప్పే అధికారం ఆశిస్తే వచ్చేదికాదనీ, అది జ్ఞాన ప్రేరితమై వ్యక్తికి స్వాస్థ్యమైన కార్యకరణశక్తి అని గుర్తించలేక పోతున్నావు సంప్రదాయపు పంకెళ్ళను తెంచుకోలేక పోవటంవల్ల యీ తప్పు దొర్లింది. ఎన్నికల్లో మీరు పాల్గొంటే వచ్చేది ఆశిస్తే వచ్చేది నిరంకుశాధికారం. కాని నీవు పాల్గొంటే వచ్చేది నీ వ్యక్తిగతశక్తి సామర్థ్యాలకు సమాంతరమైన ప్రజాస్వామ్యాధికారం. నీవు కోరదలచింది కోరవలసింది ప్రజాస్వామ్యాధికారంకాని నిరంకుశాధికారం కాదుకదా?

నే: ఆ సంగతి నీవు నాకు చెప్పనవసరంలేదు. ఆ విషయమై మేము సాంగోపాంగంగా చర్చించి నిర్ణయాలు చేశాం.

దే: నిర్ణయాలు చేయుట మొకెత్తు; వాటిని సమన్వయించి సద్వినియోగ పరచట మొకెత్తు; అందుకే ప్రజాస్వామ్య దృక్పథం ప్రగాఢమైనదిగా వుంటేతప్ప అది సాధ్యంకాదు.

నే: అయితే మా సంగతి నీకు బాగా తెలియదన్నమాట సమాజమంటే వ్యక్తుల సముదాయమనీ రాజ్యమంటే సమాజంయొక్క రాజకీయ వ్యవస్థ అనీ సిద్ధాంతీకరించి, వ్యక్తి సర్వస్వామ్యహక్కు ఏ పరిస్థితుల్లోనూ మరొకరికి దత్తం కాని రీతిలో రాజకీయవ్యవస్థా స్వరూపాన్ని చారిత్రికానుభవం నుంచి రాబట్టాం మేము. ఒకప్పుడు భారతదేశంలో సాగిన గణతంత్ర రాజ్యాలనూ గ్రీసులో వెలసిన నగర రాజ్యాలనూ

దృష్టిలో వుంచుకొని, ఈనాటి పెద్ద పెద్ద జాతీయ రాజ్యాలు ప్రజాస్వామికంగా సాగటాని కనువైన ప్రజాసంఘాల నిర్మాణ కార్యక్రమాన్ని రూపొందించాం. లెనిన్ నెలకొల్పిన సోవియట్లలోని నిర్బంధతత్వమూ గాంధీ సూచించిన లోక్‌సేవక్‌సంఘాలలోని సనాతనతత్వమూ లేని ప్రజాసంఘ పద్ధతిని ప్రతిపాదించాం. ప్రజా సంఘాలకు ప్రజలలో సహకార భావం ప్రాతిపదిక కమకనూ వ్యక్తిత్వ విలువను గుర్తించలేనివారు సహకారభావపు విలువను గుర్తించటం సంభవంకాదు కనుకనూ పౌరులలో తదనుగుణమైన విద్యావ్యాప్తి జరగవలసిన ఆవశ్యకతను నొక్కిచెప్పాం. దేశ వ్యాప్తంగా వరుసుకొనివుండే ప్రజా సంఘాల వికేంద్రీకరణ ప్రాతిపదికగా గ్రామ పంచాయితీలు లగాయితు కేంద్ర ప్రభుత్వందాకా నెలకొనదగిన రాజ్యనిర్మాణ చిత్రానికి అచ్చుగుద్దినట్లు రూపకల్పనచేసి ప్రచారం సాగిస్తున్నాం. శాసనసభల్లో నైనా ఒక అంశంమీద ఏకీభవించిన సభ్యులంతా మరో అంశంమీద ఏకీభవించాలని లేదు. అక్కడ వోటింగు పద్ధతి పార్టీ విధానాలలో వుండే కలసికట్టుతనంగాకాక, చర్చాంశాలపై ఆమోద విభేదాలను వ్యక్తిగత వివేచనకు బద్ధంచేసే కలుపుగోలు తనంగా వుంటుంది. ఎన్నుకొన్న ప్రతినిధులను దింపేహక్కు, శాసన సభలకు చర్చాంశాలను ప్రతిపాదించే హక్కు, మౌలికాంశాలపై నిర్ణయాధికారాన్ని తమ గుప్పెట్లో అట్టి పెట్టుకొనే జనవాక్యహక్కు ప్రజాసంఘాల కుండాలని చాటే నా ప్రజాస్వామ్య దృక్పథాన్ని శంకిస్తున్నావా?

దే: సర్వాలేదు. నీకు సవ్యమానవవాద రాజకీయ విధానం ఒంటపట్టినట్లే. నీ ప్రజాస్వామ్య దృక్పథాన్ని శంకించవలసినపని నాకులేదు. అయితే దృక్పథం వుండటం వేరు, ఆ పథాన్ని అనుసరించ గలగటం వేరు. చరిత్రలో చాలాచాలా దృక్పథాలు నానాట తలెత్తినై. ఆచరణలో చివరకు అన్నీ అపజయం పొందాయనవచ్చు. బౌద్ధం, జైనం, అద్వైతం లాంటి వాటికీ అదేగతి పట్టింది. రాచరికంమీద తిరుగుబాటుగా వచ్చిన ఆధునిక ప్రజాస్వామ్యం లాంఛనప్రాయంగా మారిపోయి పార్టీ నాయకత్వ నిరంకుశత్వంగా దిగజారి, ఎన్నికకాని రాజుల స్థానంలో ఎన్నికయ్యే రాజుల్ని ప్రతిష్ఠించింది. పేదలపాలిటి పెన్నిధిగానూ ఉన్నత ప్రజాస్వామ్యానికి ఉపకరణంగానూ అంతర్జాతీయ వాదంగానూ

బయలుదేరిన కమ్యూనిజం కార్మిక నియంతృత్వం సాకుతో పార్టీ నియంతృత్వాన్ని నెలకొల్పి జాతీయ కమ్యూనిస్టు రాజ్యాలను స్థాపించి కొత్తతరహా సామ్రాజ్య వాదంగా పరిణమించింది. ఈనాడు మీరు ప్రచారం చేస్తున్న సహకార రాజకీయ విధానం మటుకు ఆచరణలో వెర్రితలలు వేయదన్న గ్యారంటీ ఏమిటి?

నే : పై విధానాలు ఆచరణలో దెబ్బతినటానికి ముఖ్యకారణం వాటి ఆలోచనా సరణిలో అంతర్గతంగా వున్న తార్కికలోపాలే. ఆ దోషాలను పరిహరించి సహేతుకంగా సిద్ధాంతాన్ని రూపొందిస్తే అది తప్పక విజయవంత మవుతుంది మానవుడు హేతుశీలికదా! కనుకనే సహేతుకమైన ఆలోచన హేతుశీలియైన మానవుణ్ణి సహేతుకమైన ఆచరణకు పురికొల్పక మానదు.

దే : నీ వాదంలో వివాదాస్పదమైన అంశాలు ముఖ్యంగా మూడు తలెత్తుతున్నాయి. ఒకటి—మానవుడు ఎంతమట్టుకు హేతుశీలి? అనేక సందర్భాలలో అతడు ఎంతో అహేతుకంగా ప్రవర్తిస్తాడన్నది అందరికీ తెలిసిన అంశమే. రెండు—మీ ఆలోచన సహేతుక మనటానికి నిర్ధారణ ఏమిటి? ఎవరి సిద్ధాంతం వారికి సహేతుకంగానే కనిపిస్తుందికదా? మూడు—ఆలోచన అవశ్యంగా తదనుగుణమైన ఆచరణకు దారి తీస్తుం దనటానికి ఆధారమేమిటి?

నే : ఒకటి—మానవుడు హేతుశీలి అంటే అహేతుకంగా ప్రవర్తించడని కాదు అహేతుకమైన ఆ ప్రవర్తనను కూడ మనం సహేతుకంగా వివరించవచ్చునని దాని తాత్పర్యం. రెండు—చారిత్రికంగా సాగిన మిగతావిధానాల లోటుపాటులను చర్చించి, వాటి సాఫల్య వైఫల్యాలకు కారణా లన్వేషించి, ప్రస్తుతపరిస్థితుల దృష్ట్యా సుదీర్ఘ చర్చల ఫలితంగా మా విధానం రూపొందించాం ఇదే జాతకచక్ర మన్న భ్రాంతి మాకు లేదు. ఎప్పటి కప్పుడు అనుభవం నేర్పే పాఠాలను పరిగణనలోకి తీసుకొని మా విధానాలను సవరించుకోటానికి మేమెప్పుడూ సంసిద్ధులమే. మూడు—ఆచరణను నడిపేది ఆలోచనే కనుక సహేతుకమైన ఆలోచన సహేతుకమైన ఆచరణకు దారి తీస్తుం దనుకోవటంలో తప్పేమిటి?

దే : సహేతుకంగా వివరించబడటమే హేతుశీల మయితే ప్రపంచంలో స్వభావతః హేతుశీలి కాని దేది? జీవ ప్రపంచాన్ని నిర్జీవ ప్రపం

దాన్ని సైతం సహేతుకంగా వివరించగలం. కనక నీవు చెప్పే అన్వయం ప్రకారమైతే, హేతుశీలత మానవునికి మాత్రమే సొత్తు అయినట్లు, మానవుడు హేతుశీలి అని నిర్వచించటంలో అర్థంలేదు. రెండోది—అనుభవం ఆధారంగా విధానాలను సవరించుకొనటానికి సంసిద్ధతను చూపనివా రెవరు యీనాడు? ఇతరుల సిద్ధాంతాలు ఆచరణలోకివచ్చి వారు తమ ప్రయత్నంలో విఫలు లయ్యారుగనుక విమర్శకు గురిఅవుతున్నారు. మీ సిద్ధాంతం ఇంకా ఆచరణలోకి రాక పోవట మొక్కటే మీ ప్రచారానికున్న ప్రత్యేక సదుపాయం. ఇది కాదనటానికి నీకు బలమైన ఆధారమేమిటి? ఊహాపోహలకు ఆలవాలాలైన యీ రెండు అంశాలను అలావుంచుదాం. మూడోది అనుభవబద్ధమైనది. ఆచరణను నడిపేది ఆలోచనే అని నీ అనుభవం నీకు నిజంగా బోధించిందీ?

నే: నా అనుభవమేమిటి? ఎవరి అనుభవమైనా ఇదే చెబుతుంది. మనం ఏదైనా ఒకపని చెయ్యాలనుకోకుండానే చేస్తామా యేమిటి? ముందు ఆలోచిస్తాం; తర్వాత ఆచరిస్తాం. ఇంత స్పష్టమైన యీ అనుభవాంశాన్ని వివాదాంశం చెయ్యటంలో నీ వుద్దేశమేమిటి?

దే: ఎంత సులభంగా చెప్పేశావ్? ఒక్కవిషయం చెప్పు తప్పొప్పులు తెలిసినవారు ఎవరైనా తప్పు చెయ్యాలని తలపోస్తారా?

నే: నిజంగా తెలిసిన వారైతే అలా యెందుకు తలపోస్తారు?

దే: మీ మానవవాదులేమీ హేతువాదులేమీ భౌతికవాదులేమీ భావవాదులేమీ అభావవాదులేమీ మరేవాదులైనా సరే—వారికి తప్పొప్పులు తెలియవంటావా?

నే: తెలియక పోవటమేమి? కాస్త విచక్షణజ్ఞాన మున్న ప్రతివ్యక్తికీ తప్పొప్పుల తారతమ్యం తెలుస్తుంది. అందులోనూ హేతుసిద్ధమైన నైతికబుద్ధి మా నవ్య మానవవాదానికి మకుటాయమానం కూడా

దే: సరే మీ నవ్య మానవ వాదుల్నే తీసుకుందాం. మీరంతా వివిధ జీవిత రంగాలలో నైతికంగా ప్రవర్తిస్తున్నా మంటారా?

నే: 'ప్రమాదో ధీమతా మపి' అన్నారు. పొరపాట్లు మానవ సహజాలు నవ్యమానవవాదులు మానవులు కారాయేమిటి?

దే: తప్పు కప్పిపుచ్చినంతమాత్రాన ఒప్పు కాదు. తప్పును ఒప్పుకో లేక

పోవటం పెద్ద తప్పవుతుంది. తెలియక చేసేవి పొరపాట్లవుతాయి. తెలిసి చేసేవి తప్పులవుతాయి. నేను పొరపాట్లను గురించి మాట్లాడటం లేదు. తప్పుల్ని గురించి మాట్లాడుతున్నాను.

నే : తప్పులు మటుకు మానవ సహజాలు కావంటావా?

దే : నేనలా అనటంలేదు. ఇక్కడ నాకు కావలసిన అంశం ఒక్కటే. హేతుబద్ధమైన నైతికపద్ధతికి ప్రాముఖ్యమిచ్చే నవ్యమానవవాదుల ఆలోచన సదసద్వివేక సంపన్నంగా వుంటుంది కదా. అంటే ఏది తప్పో ఏది ఒప్పో వాళ్ళకు స్పష్టంగా తెలుసు; తప్పు చేయరాదని తెలుసు; ఒప్పు చేయాలని తెలుసు. అయినా, మానవ సహజంగానే ఇతరులలాగా అడపా దడపా తప్పులు చేస్తూనే వున్నారు; అన్ని వేళలా ఒప్పు చేయలేక పోతున్నారు. అంటే సదాలోచనవున్నా సదాచరణసాధ్యం కావటం లేదన్నమాట. కాబట్టి ఆచరణను నడిపేది ఆలోచనే అనటం వాస్తవం కాదని తేలటం లేదూ? ఆవేశానికి లోను కాకుండా కాస్త ఆలోచించి చెప్పు.

నే : నిజమే. కాని చరిత్రలో భావవిప్లవాలురాకుండా ఏ సామాజికవిప్లవమూ వచ్చినట్లుకనపడదు. అలా ఆచరణకు పూర్వం ఆ సంబంధమైనఆలోచన అవశ్యం వచ్చినట్లుచరిత్ర యిస్తున్న సాక్ష్యాన్ని గూర్చి ఏమంటావు?

దే : భావాల ప్రభావం సృజనాత్మక నిర్మాణాత్మక కార్యాలకువర్తించేమాట చాలవరకు యథార్థమే. కాని అది నైతికరంగానికిచెల్లటంలేదు. ఈ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కీలక సమస్య నైతిక సమస్యయే అనీ అది పరిష్కారమైతే సామాజికసమస్య లన్నీ పరిష్కారమైనట్లే అనీ నీకూ తెలుసు. మరి అలాంటి నైతిక సమస్య విషయంలో మీరుకూడా ఓటమికి లోనవుతున్నారంటే ఇది సామాన్య విషయ మంటావా? ఈ అంశాన్ని మీ సంఘ సమావేశాల్లో చర్చించారా ఎప్పుడైనా మీరు?

నే : అది ప్రత్యేకంగా చర్చించ వలసిన సందర్భం రాలేదు.

దే : సందర్భం దానంతట అదే వస్తుందా యేమిటి? అదసలు మనస్సుకు తట్టలేదను, బాగుంటుంది. వ్యక్తిగత మానవవృద్ధి సమాజానికి మూలంగా విలువ లన్నిటికి కొలమానంగా, తన భవితవ్యానికి స్వయంకర్తగా, చిత్రిస్తారే మీరు - అలాంటి మానవుని నైతికాచరణ నైతికాలోచనకు ఎదురుతిరుగుతున్నదన్న అనుభవ పూర్వకమైన వాస్తవాంశం చర్చిం

చుకోవలసిన సందర్భం రాకపోయిందంటే అది నిజంగా శోచనీయమే. ఈ లోపం యాదృచ్ఛికమైతే పర్వాలేదు; అదే ఐచ్ఛికమైతే ఏమనాలి?

నే : ఇది నాకు తెలిసినంతలో ఐచ్ఛికం కాదు. యాదృచ్ఛికమే. రానున్న సమావేశాల్లో యీ అంశాన్ని వెలుగులోకి తెస్తాను.

దే : అది సరే, నైతికంగా ఆలోచన - ఆచరణల అంతరానికి చెందిన యీ సమస్యను నేను ప్రస్తావించానుకదా? నీకైనా ఇది ముఖ్య సమస్యగా కనిపించటంలేదా?

నే : కనిపించక పోవటమేమి? అందుకే కదా దీన్ని వచ్చే సమావేశంలో వెలుగులోకి తెస్తానంటున్నాను.

దే : ఆలోచన - ఆచరణల మధ్య ఇంతటి అంతరం ఎందుకు ఏర్పడుతున్నదో ప్రస్తుతం నీ అవగాహన కేమీ అందటం లేదా?

నే : నేనదే ఆలోచిస్తున్నాను. నాకు తోస్తున్న దేమంటే—ఆలోచన కేవలం చేతనకు చెందిన భావసమన్వయం. ఆచరణ భావాలకేకాక అధశ్చేతనకు చెందిన సహజాత వాసనలకూ, వాడి మండలానికి చెందిన ప్రేరణలకూ బద్ధమై వుంటుంది కదా. కనుకనే ఆలోచనదారి ఒకటైతే అనేక సందర్భాలలో ఆచరణదారి మరొకటి కావటం కద్దు. అందుకే ఆలోచనలో విజ్ఞులైనవారు ఆచరణలో అజ్ఞుల్లాగా ప్రవర్తిస్తుంటారనిపిస్తున్నది దీనిని బట్టి ఎవరైనా చెప్పేవన్నీ చెయ్యటం అసాధ్యమని తెలుస్తున్నది

దే : కాబట్టి నైతికాలోచనలు నిరర్థకాలన్నమాటేగా? సామాజిక నైతిక తత్వంగా ప్రసిద్ధిగాంచిన మీ మానవవాదం చెప్పటానికి పనికి వచ్చే జ్ఞానయోగమేకాని చెయ్యటానికి పనికి వచ్చే కర్మయోగం కాదన్నమాట

నే : అలాకాదు ఎవరైనా చెప్పేవన్నీ చెయ్యలేరని మాత్రమే నా భావం. అందుకు మరొక కారణం కూడా లేకపోలేదు.

దే : అగు అగు. చెప్పేవి చెయ్యలేనివే అయితే అవి చెప్పటం దేనికి? ఆచరణ సాధ్యంకాని ధర్మపన్నాలు ఎందరు చెప్పలేదు? ఎందరు చెప్పటంలేదు? వారి కన్నా మీలో విశేషమేమిటి? అలాంటప్పుడు మిమ్మల్ని ఎవరైనా ఎందుకు నమ్మాలి?

నే : మతవాదుల, రాజకీయవాదుల వాదనలకన్నా మా నవ్యమానవవాదుల వాదనలు ఎంతో తర్కబద్ధంగా శాస్త్రీయంగావుంటాయి. మా ఆలోచనలు

మంచిదైనప్పుడు వాటి ప్రభావం వల్ల మా ఆచరణకూడ మెరుగయ్యే అవకాశం వుంటుంది కదా?

దే: ఆచరణ మీద ఆలోచనలే కాక వాసనలూ ప్రేరణలూ ప్రభావం చూపుతాయని ఒప్పుకొంటున్నావు. ఇక్కడ ఆలోచనలకు స్థానమైన చేతన ప్రభావం మిగతా ప్రభావాలతో పోలిస్తే అత్యంత దుర్బలమైనది. అలాంటపుడు నీ తర్కం నిన్ను ఎంత వరకు పవిత్రుద్ధి చెయ్యగలదు? నీ సదాలోచన సదాచరణకు ఎంత వరకు దోహదం కాగలదు?

నే: ఇది మరీ భేషుగ్గావుంది. ఆచరణలేని ఆలోచన దేనికంటావు ఒకపక్క. ఆచరణ ఆలోచనను అనుసరింప దంటావు మరో పక్క. ఏమిటీ ద్వైధీభావం? అలాంటప్పుడు కర్తవ్యం?

దే: అదే ఇప్పుడు తేలవలసిన జటిల సమస్య. దానికి వద్దాం. కాని మనం చెప్పేవన్నీ చెయ్యలే మనటానికి మరోకారణముందని ఏదో చెప్పబొయ్యావే ఇందాక, అదేమిటి?

నే: అదా? నా ఆలోచన కేవలం నా మనస్సుకు సంబంధించింది. అందువల్ల అది నాకు వ్యక్తిగతం. కాని నా ఆచరణ ప్రభావం పదిమంది మీద పడుతుంది. కనుక దానికి ఇతరుల ఆమోదముద్ర కావాలికదా? ఆలోచన వ్యక్తిగతమైనది. ఆచరణ వ్యక్తిగతమేకాదు, సంఘగతం కూడా. ఈ రెండికీ ఏకీభావం ఎంత వరకు సంభవం? వ్యక్తిని చేసేది ఆలోచన సమాఖ్యను చేసేది ఆచరణ అని నీవు అన్నదే కదా?

దే: అందుకని నీ వనే దేమిటి? నీ ఆలోచనలకు భిన్నంగా ఇతరుల కనుకూలమైన పనులే ఆచరిస్తానంటవా? ఇతరుల కందరికి ఒకేరకంగా అనుకూలమైన పని అంటూ వుంటుందా ఏమిటి? ఏ ఇద్దరి ఆలోచనలూ పూర్తిగా ఏకీభవించవు. అలాగే ఏ ఇద్దరి అవసరాలూ ఏకీభవించవు. అందువల్ల ఏ ఇద్దరి ఆచరణా ఏకీభవించటానికి వీలులేదు. కనుక ఇతరులకు ఆమోదయోగ్యంగా ఆచరించాలనుకునే వాడు ఒకేసారి ఆత్మవంచన పరవంచన చేసుకొంటున్నాడన్నమాట. కాబట్టి ప్రతి వ్యక్తి తన ఆలోచనలను ఆచరణలోనికి అనువదించట మెలాగన్నదే ఇక్కడ ముఖ్యంగా ఆలోచించవలసింది.

నే: మళ్ళీ ఇందాకటి చోటికే వచ్చావు. ఆచరణ ఆలోచన ననుసరింప దంటూనే ఆలోచనను ఆచరణలోనికి అనువదించటం సంభవమన్నట్లు

మాట్లాడతావే? ఏమిటి పొంతనలేని మాటలు?

దే : అవును. సమస్యను ఇంకాక మధ్యలో వదిలాం. ముఖ్యంగా నైతిక రంగానికి సంబంధించి నంతవరకు ఆచరణ ఆలోచనను అవసరమైనంతగా అనుసరించటం లేదన్న వాస్తవాంశాన్ని నీవూ అంగీకరించావు. కాని అందుకు భిన్నంగా ఆచరణ ఆలోచనను అనుసరించేట్లు చూడటం మనకు ప్రధమాదర్శంగా వుండాలి. లేక పోతే మన రాద్ధాంత సిద్ధాంతాలన్నీ మెట్టవేదాంతాల కింద జమ అవుతాయి. కేవల సిద్ధాంత పరమైన ఆలోచన నిరర్థకం. అందుచేత ఆలోచనను ఆచరణగా అనువదించటానికి అనుకూలమైన పథకాలను గూర్చి ఆలోచించటం అవశ్యకర్తవ్యం. ఒక్కటి చెప్పు. నీవు చెప్పే నవ్య మానవ వాదం వాద మంటావా? జీవిత పథ మంటావా?

నే : అది నిక్కచ్చిగా జీవితపథమే. అందులో అనుమానం అవంతైనా లేదు.

దే : వాదమైతే వదిమందికి ప్రచారంచేస్తే సరిపోవచ్చు. జీవిత పథమైతే దాన్ని అనుసరించాలి కదా? మానవ వాదాన్ని జీవించక పోతే— జీవిత పద్ధతిగా ఆచరించకపోతే—నీవు మానవ వాది వెలా అవుతావు?

నే : నిజమే. మానవవాదాన్ని జీవితంలో అడుగడుగునా అమలుపరచాలనే వుంటుంది కాని దైనందిన జీవితంలో అనేక సందర్భాల్లో నాకు తెలియకుండానే నా ఆచరణ పెడదారి పడుతున్నది. ఇది అన్నివాదాలకూ అందరు వాదులకూ వర్తిస్తుం దనుకుంటాను. వాదానికి పాత్రినిధ్యం వహించేవాది ఉండటం అసంభవమేమో అని నా అనుభవం చెబుతున్నది. కనుక మానవవాదం వున్నంతగా మానవవాది వుండటానికి వీలు లేదేమో?

దే : మానవ హృదయం నీలో స్పందిస్తున్నది కనుకనే ఆ మేరకైనా నీవు ఆలోచింపగలిగావు. ఎంతమంది 'మానవవాది' ముద్రలు తగిలించుకొని, ఆ ముద్రలే తమకు సిసలైన యోగ్యతా పత్రాలైనట్లు ప్రవర్తించటం లేదూ? ఆచరణను ఆదరించకుండా, ఆదరించటానికి ప్రయత్నమైనా చెయ్యకుండా, ముద్రలను మాత్రం భద్రపరచుకొనే మానవవాద బోధకులు మానవవాదు లెలా కాగలరు?

నే : అయితే మా మానవవాదసంఘం లోని సభ్యుల చిత్తశుద్ధిని శంకించ

వద్దు. మానవవాదాన్ని అక్షరాలా అమలు జరపాలన్న ఆవేదనను ప్రకటిస్తూకూడా చాలమంది చాల సందర్భాల్లో అందుకు విరుద్ధంగా ప్రవర్తించటం లేదని నే ననను. అందుకు ముఖ్యకారణం ఆలోచనల కన్న బలీయాలైన సహజాత వాసనల—ప్రేరణల ప్రభావమే అనుకుంటా.

దే: మానవవాదాన్ని జీవించలేక పోవటానికి ముఖ్యకారణం అది వారి నరనరాల్లో జీర్ణం కాకపోవటమే. జీర్ణమైతే వాసనలూ—ప్రేరణలూ ఆలోచనల్ని అనుసరించగలవు. 'నీవు ఆ మార్గంగా మారిపోతే తప్ప ఆ మార్గాన పయనించ జాలవు' అన్న గౌతమ బుద్ధుని సూక్తిని ఒక్కసారి మననం చేసుకో. ఆత్మవికాస ప్రయత్నంలో మానవవాద పథంతో తాదాత్మ్యం చెందనిదే ఎవ్వడూ మానవవాదిగా ప్రవర్తించలేడు; కనుక మానవవాది కాజాలడు. అంటే మనిషి తన ఆలోచనతో తాదాత్మ్యం పొందినప్పుడే అది ఆచరణగా పరిణమిస్తుంది. అప్పుడే అతడు ఆలోచించింది అనగలడు; అన్నది ఆచరించగలడు. ఈ త్రికరణశుద్ధి సాధనావశ్యకతను మీ మానవవాదులు ప్రధానాంశంగా గుర్తించటం లేదన్నది బహిరంగ సత్యం కాదంటావా?

నే: ఆ మార్గంగా మారిపోవాలని గౌతమబుద్ధు డనవచ్చు; ఆలోచనతో తాదాత్మ్యం పొందాలని నీ వనవచ్చు. ఎవరేమన్నా అది అసంభవ మంటున్నాను. ఆలోచనకు దోహదమయ్యే చేతనకన్నా నైతికాచరణలో ప్రాధాన్యత వహించే వాసనలకూ ప్రేరణలకూ స్థానాలైన అధశ్చేతన, నాడీ మండలం అత్యంత బలీయాలు. పదింట ఒక్కపాలే చేతన; తొమ్మిది పాళ్లు అధశ్చేతన; యీ రెండికీ మూలాధారమైన నాడీ మండలం సంగతి చెప్పనవసరం లేదు. అలాంటప్పుడు ఆ మార్గంగా మారిపోయ్యే దేమిటి? ఆలోచనతో తాదాత్మ్యం పొందే దేమిటి?

దే: ఏతావతా తేలిందేమిటి? నాడీ మండలం, అధశ్చేతనలు సహకరించకుండా ఒక్క చేతన చేయగలిగింది ఏమీ లేదన్నమాట, ఊహాజగత్తులో ఊగిసలాడటం తప్ప.

నే: దాదాపు అంతే అనవచ్చు. పరిణామ క్రమంలో చేతన బలం పుంజుకొనేకొద్ది, జ్ఞానసాధనమైన హేతువద్ధతి పాదుకొంటుంది. అది ఎంత ఎక్కువగా జరిగితే నాడీమండలం, అధశ్చేతనలు అంత ఎక్కువ

చేతన అదుపులోకి వస్తూవుంటాయి. దాన్నికాలం నిర్ణయించాల్సిందే.

దే : నీ కాల నిర్ణయ వాదానికీ మతవాదుల దైవనిర్ణయ వాదానికీ తేడా యేమిటి? మానవవాదాని కెంత దుస్థితి పట్టిస్తున్నావు? మానవుడు తన భవితవ్యానికి తానేకర్త అని నీవు చాటేదంతా బూటకమేనా?

నే : కాదు. అది మానవవాద లక్ష్యం.

దే ; మానవునికి స్వనిర్ణయవాదం లక్ష్యమూ, పర నిర్ణయవాదం సాధనమూ అన్నమాట. లక్ష్యసాధన సమన్వయంలో నీ అవగాహన అద్భుతం!

నే : ఇన్నిటికీ నీవనే దేమిటి?

దే : నీటిలో పైకి కనిపించే కొద్దిభాగం మంచుగడ్డను చూచి అదే సర్వస్వం అని భ్రమించినట్లు పైకి ఆలోచిస్తున్న చేతన ఒక్కటే మానవుని సొత్తు అయినట్లూ, ఆ చేతన ప్రకటించే హేతుపద్ధతితప్ప మరో జ్ఞానసాధనం లేనట్లూ భావించటం అవివేకం. పదింట ఇంచుమించు తొమ్మిదిపాళ్ళు నీళ్ళలో దాగివున్న మంచుగడ్డలాగా అధశ్చేతన, నాడీ మండలం అంతర్గతంగా విస్తరించి వున్నాయి. వీటన్నిటి మధ్య సయోధ్యను సాధించుట మెలాగన్నదే ప్రస్తుతం ఆలోచించవలసి వుంది.

నే : మళ్ళీ ఇదైనా ఆలోచించేది చేతనయేకదా? ఈ విషయమై దుర్బలమైన చేతన చేయగలిగే దేముంది?

దే : దృశ్య వాస్తవికత అయిన చేతనకూ, అదృశ్య వాస్తవికతలు గాతోచే అధశ్చేతన నాడులకూ మధ్య బద్ధవైర మున్నదనుకొంటున్నావా? ప్రకృతి జన్యమైన జీవజగత్తులో పరిణామ క్రమంలో వరుసగా వికసిస్తూ వచ్చినవేకదా నాడీ మండలమూ మెదడూ? మెదడుయొక్క విశిష్ట శక్తులుగా ఉత్పన్నమైనవే కదా అధశ్చేతనా, చేతనా? వీటిలో దేని ప్రయోజనం దానికుంది; దేనిశక్తి దానికుంది. వీటిమధ్య సయోధ్యను సాధించటమంటే అది చేతన ఏకాఎకి చేయగలిగేది కాదు. కాని సయోధ్యను సాధించటానికి గల సాధనంను గూర్చి ఆలోచించగలదు.

నే : అదైనా యెలా సాధ్యమో నాకు అర్థం కావటంలేదు.

దే : మానవుని మనస్సు అతి విచిత్రమైనది. అది ప్రస్తుతం బాహ్యంగా విశ్వాంతరాలలోకి ఎగబాకి అమోఘమైన జ్ఞాన సంపదను సేకరిస్తున్నది. దాని గమనం ప్రస్తుతం ఏక ముఖంగా సాగుతున్నది. కావా

అనుకుంటే అది అంతరాంతరాల లోని అమూల్యమైన శక్తుల్ని కూడ అన్వేషించి వెలికి లాగగలదు. అలా బయటికీ లోనికీ ద్విముఖ గమనం సాగించవలసిన మనస్సు బయటకు చూడటమే పరమాశయంగా పెట్టుకొని, లో చూపును పూర్తిగా విస్మరించటమే నేటి దుస్థితికిమూలం.

నే : ఒకప్పుడు మనిషి లోచూపుతోనే కాలక్షేపం చెయ్యలేదా? దాన్ని ఆధ్యాత్మికం అన్నారు. దాని ఫలితంగా ఏం జరిగింది? మనిషి గూటి పురుగులాగా నిద్రాణ స్థితిలో పడిపోలేదూ? బయటికి చూడటం మొదలు పెట్టినాకే అతడా మత్తునిద్ర నుంచి లేచి శాస్త్రయుగంలో వచ్చాడు. కడుపునిండా తినటానికి కావలసినన్ని తినుబండారాలను ముందుంచింది శాస్త్రయుగమే కదా?

దే : ఆనాటి మనిషిది మెలకువలేని జబ్బు కావచ్చు. ఈ నాటి మనిషిది నిద్ర పట్టని జబ్బు. ఆనాటిమనిషిది ఆకలి తీరనిబాధ; ఈనాటి మనిషిది అన్నీవుండి అవసరాలకు అందని బాధ; అందినా అరగని బాధ. కాదంటావా? నిత్యనిద్రాణస్థితి ఎలా వాంఛనీయం కాదో అలాగే నిత్య జాగరణస్థితి కూడా వాంఛనీయం కాదు. శాస్త్రయుగం రాక పూర్వం మనిషి ఒక రోగంతో బాధపడితే శాస్త్రయుగం మనిషిని మరో రోగానికి గురిచేసింది. నిద్రావస్థలో కనీసం బాధలు తెలియని అవ్యక్త సుఖమైనా వుంటుంది; నేటి జాగ్రదవస్థలో ఆ సుఖం కూడ దూరమై పోయింది మనిషికి.

నే : ఆ తప్పు శాస్త్రానిది కాదు. శాస్త్రం ప్రకృతిని మానవుని అదుపులోకి తెచ్చింది. ఈనాడు మానవుడు ప్రకృతిమీద అధికారి. అయినా శాస్త్ర ఫలితాలు అందరికి అందుబాటులోకి రాకపోవటానికి ముఖ్య కారణం కొందరు స్వార్థపరుల ప్రలోభాలకు అవకాశమిచ్చే లోప భూయిష్టమైన సాంఘిక వ్యవస్థయే.

దే : ప్రకృతిమీద మానవుడేనాడూ అధికారికాదు. అధికారి అనుకోవటం ద్వైతభావన. అది అలా వుంచుదాం. తప్పు కేవలం శాస్త్రానిదని నేనన్నానా? చాలవరకు వ్యవస్థదే. అయితే ఆ వ్యవస్థలను నిర్మిస్తున్న దెవరు? నిర్వహిస్తున్న దెవరు? నీలాంటి మనుషులు కాదా?

నే : నాలాంటి మనుషులే. అందుకనే కదా, వ్యవస్థలు మారాలంటే ముందు మనుషులు మారాలనటం?

దే: మారాలంటున్నావు బాగుంది; మారటానికి నీవు చూపే మార్గమే కనపడటంలేదు.

వే: మార్గమేనాడో చూపాం మేము. అదేమంటే—ముందు మనిషిలో వివేకం వికసించాలి; దానితోబాటు విక్రమం విజృంభించాలి; దాని ఫలితంగా విప్లవం విలసిల్లాలి. మా ఉద్దేశంలో విప్లవమంటే కొందరు సామ్యవాదులు చాటే సాయుధమైన తిరుగుబాటుకాదు. ప్రజాస్వామ్యవాదులు కోరే అభ్యుదయకరమైన మార్పునే విప్లవ మంటాం:

దే: సామ్యవాదమొక విప్లవ భావం; ప్రజాస్వామ్యమొక భావ విప్లవం. ఈ రెండూ విరుద్ధాలు కానవసరం లేదు. అదిసరే. నీవనే వివేక—విక్రమ—విప్లవాల విన్యాసం ఎలా ఆచరణ సాధ్యమో నీవు చెప్పటం లేదు. వివేకం వికసించి సంతమాత్రాననే జరిగే దేముంది? మీ సంఘంలో వివేకం వికసించిన వాళ్ళెందరు లేరు? వాళ్ళంతా విక్రమిస్తున్నారా? విప్లవిస్తున్నారా? వివేకం ఆలోచనగానే ఆగిపోతున్నది? మనిషిని ఆచరణకు ఆయత్తం చెయ్యలేని ఆలోచనవల్ల ప్రయోజనమేమిటి? చివరకు మన చర్చ ఇందాకటి చోటికే వచ్చింది, చూశావా?

వే: అవును. ఆలోచనలను ఆచరణలోనికి అనువదించటమెలాగన్న మౌలిక సమస్య వద్దకే వచ్చాం. ఈ సమస్యకు పరిష్కారమార్గం చేతనకు అందరానిది కాదని నీవంటున్నావు కాని నా మటుకు నాకు అది అగమ్యగోచరంగావుంది.

దే: మనిషిలో అనంతంగా అంతర్గత శక్తులున్నాయని మీ తత్వం చెబుతున్నదికదా. ఆ శక్తుల్ని గూర్చి ఏమన్నా ఆలోచించావా?

వే: ఆ విషయం మా తత్వ సూత్రాలలో ఒకచోట ప్రస్తావించబడింది. దాని సంబంధమైన వివరణ ఎక్కడా తగినంత లేదనే అనాలి. అందుకేనేమో నీ విపుడు ప్రస్తావించిందాకా దాన్ని గూర్చిన స్పృహే లేక పోయింది నాకు.

దే: పోనీలే. ఒకటి మాత్రం గుర్తుంచుకో. ఈ అంతర్గత శక్తులు చేతనకు చెందినవి కావు. చేతన పరిధి విస్తృత మైనదైనట్లు అనిపిస్తుంది కాని దాని శక్తి పరిమితం. ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. నీ దేహచర్యల్లో చేతన చెప్పుచేతల్లో వుండేవెన్ని? కొన్ని కండర చర్యలు తప్ప మిగతా జీవకార్యాలన్నీ చేతన పరిధికి అందనివే. మానవుని బాహ్య ప్రపంచా

నికి ప్రధానంగా ఆధారభూతమైన అంతఃప్రపంచం కూడా చాలవరకు అధశ్చేతన పరిధిలోదే.

నే : ఇక్కడ నీ పొత పొరపాటును సవరించుకోవాలి. మానవుని బాహ్య ప్రపంచానికి ప్రధానంగా ఆధారభూతమయినది ప్రకృతి కాని అంతః ప్రపంచంకాదు కదా.

దే : పొరపాటు నాది కాదు, నీదే. ప్రకృతి లేకుండా మానవుని బాహ్య ప్రపంచం వుంటుందని నే ననలేదు. కాని బాహ్య ప్రపంచం వున్నది మనిషికే అని మరవ వద్దు. ప్రకృతి అందరికీ సమానమే. కాని ఎవరి బాహ్య ప్రపంచం వాళ్ళదే. ఒక్కొక్క మనస్సు ప్రకృతి నుంచి తన ప్రవృత్తికి అనుకూలమయిన బాహ్య ప్రపంచాన్ని సృష్టించుకొంటుంది అందువల్ల మానవుని అంతఃప్రపంచమూ బాహ్యప్రపంచమూ వేరు కావు. ప్రకృతి ఎంతైనా వుండవచ్చు; అదంతా మానవునికి వాస్తవం కాదు. దానిలో ఎంత భాగం అతని అనుభూతిలోకి వస్తున్నదో అదే అతనికి వాస్తవం. మానవుని బాహ్యప్రపంచ మదే. ప్రకృతిని పంచేంద్రియాలద్వారా గ్రహించేది మనస్సు, మనస్సు అతని అంతఃప్రవృత్తి. ప్రకృతి అందరికీ ఒకటే అయినా అంతర్గత మానసిక శక్తులు భేదిస్తున్న కారణంగా ఒక్కొక్క మనిషి ఒక్కొక్క ప్రపంచాన్ని సృష్టించుకొంటు న్నాడు, మానవుని బాహ్య ప్రపంచ మంటే యథార్థానికి అతని భావ ప్రపంచమే. అంటే అంతః ప్రపంచమే.

నే : నీ వాదన దోష భూయిష్ఠమైనది. అది కార్యకారణ సంబంధానికి అత కదు. కొయ్య కుర్చీ కావటానికి వడ్రంగి దోహదం కావచ్చు. కుర్చీలో కొయ్య వున్నది కాని వడ్రంగి లేడు. అందువల్ల వడ్రంగి దోహదకారణం కొయ్య ప్రధాన కారణం. అలాగే మనిషి తన బాహ్య ప్రపంచాన్ని ప్రకృతి నుంచి రూపొందించుకొన్నాడు. కనుక ప్రకృతి ప్రధాన కారణం; మనిషి దోహద కారణం; నీ వాదం భౌతిక వాదానికి విరుద్ధమైన భావవాదం.

దే : నీకు భౌతికవాదమూ భావవాదమూ—ఏదీ ఒంట పట్టినట్లు లేదే. కుర్చీని వడ్రంగి చేశాడు; ఆ కుర్చీ వడ్రంగిది కాదు; వడ్రంగి ఉనికితో పనిలేకుండానే కుర్చీ మనగలుగు తుంది, మనిషి తన బాహ్య ప్రపం చాన్ని ప్రకృతి నుంచే కల్పించు కున్నాడు. ఆ బాహ్య ప్రపంచం

మనిషిది; మనిషి ఉనికి లేకుండా బాహ్య ప్రపంచానికి మనికి లేదు. ఉదాహరణకు మనిషిమనస్సులో కుర్చీని భావించాడనుకో. మామూలు కుర్చీలో కొయ్యవున్నమాట నిజమే; భావరూపకమైన కుర్చీలో కొయ్య ఏది? మామూలు కుర్చీకి, కొయ్యకూ దేశసంబంధ మయిన అవధులున్నాయి. కాని భావరూపకమయిన కుర్చీకి ఆ అవధులు లేవు. అందువల్ల అది కొయ్య కాదు కేవలం భావమే. కాబట్టి మానవుడు తన బాహ్య ప్రపంచమని దేనిని భావిస్తున్నాడో అది వాస్తవానికి తన భావ ప్రపంచమే. అంటే మానవుని బాహ్య ప్రపంచం, అంతః ప్రపంచం వేరు కాదని తేలటం లేదూ?

నే: అయితే నీ వనేది ప్రకృతి లేక పోయినా భావప్రపంచం వుంటుం డనా?

దే: అని నేనన్నానా? అలాంటి ద్వైతభావానికి ఆస్కారమే లేదు. అసలు మానవుడూ ప్రకృతి వేరుకాదు. ప్రకృతిలో జడత్వమూ చేతనత్వమూ రెండూ వున్నాయి చేతనత్వ వికాసాన్నే పరిణామ మంటారు. ఈ పరిణామ క్రమంలో మానవుడావిర్భవించాడు. కాబట్టి మానవుడంటే అత్య వికాసం పొందిన ప్రకృతి శకలం తప్ప మరేమీకాదు. అలాంటప్పుడు మానవుని భావ ప్రపంచం మటుకు అప్రాకృతికం అని ఎందుకనుకుంటావు? భావవాద—భౌతికవాద పరిభాషలో ఆలోచించే వారంతా ద్వైతులే; వంగనామా లొక్కటే తక్కువ.

నే: మామూలు కుర్చీకి దేశసంబంధ మయిన అవధు లున్నాయి కాని భావ రూపకమయిన కుర్చీకి ఆ అవధులు లేవు అన్నావు కదా? మరి కాలం సంగతేమిటి? దేశ-కాలాలు అవిభాజ్యాలైన ప్రకృతి లక్షణాలుకదా, దేశంలేని భావ ప్రపంచం ప్రాకృతిక మని ఎలా అనగలవు?

దే: అయితే నీకు నీ మానవవాద తత్వమే మబోధకం కాలేదన్నమాట అందువల్లనే పరిమాణానికి గుణానికీ, రాసికి వాసికి తేడా తెలియలేకున్నావు. పువ్వుకు పరిమాణముందికానీ, దాని గుణమైన అందానికి పరిమాణమేది? బెల్లానికి పరిమాణముంది కానీ, దాని గుణమైన తియ్యదనానికి పరిమాణమేది? వస్తువుకు పరిమాణం ప్రధాన లక్షణం; గుణం అనుషంగ లక్షణం. ప్రధాన లక్షణాలకు ప్రాధాన్యమిచ్చి, అనుషంగ

లక్షణాలపట్ల అవజ్ఞ చూపటమన్నదే ఆధునిక విజ్ఞానం ప్రదర్శిస్తున్న అవలక్షణం. మానవుని భావ ప్రపంచం ఒక విలక్షణమైన అనుషంగ లక్షణం. మెదడు పంచేంద్రియాల ద్వారా బాహ్య ప్రకృతిని గ్రహించి భావ ప్రపంచాన్ని సృష్టించు కొంటుంది అంతవరకే బాహ్య ప్రకృతి తోక్యం. ఇకదానితో నిమిత్తంలేకుండా భావప్రపంచం మనగలదు. ప్రకృతి లోని పదార్థ నియమాలూ భావనియమాలూ విభిన్నాలు. రెండు భావాలు కలిసి, మూడో భావంగా రూపొందగలవు. తిరిగి యీ మూడు భావాలు ప్రత్యేకంగా జీవించగలవు మనిషి మెదడులో. ఉదాహరణకు నేలను నడిచేబండి ఒక భావం; నింగిని ఎగిరేపక్షి ఒక భావం; ఈ రెండు భావాలూ కలిసి, నింగిని ఎగిరే బండిగా విమానం రూపొంద గలదు. మరి మీ రామాయణంలో వాల్మీకి విచిత్రమైన పుష్పక విమా నాన్ని తన బుర్రలో భావరూపంగా సృష్టించి, దానికి అక్షరరూపం కల్పించలేదూ?

నే: నేనడిగింది వేరు. భావరూపకమైన కుర్చీని దేశకాలాల పరిభాషలో సమన్వయించ మంటున్నాను.

దే: దాని పైపే వస్తున్నాను. ప్రకృతి పరిణామ క్రమంలో విభిన్నదశలు విభిన్నంగా ప్రవర్తిస్తూ వుంటాయి. పరిమాణాత్మకంగా వస్తువైన కుర్చీ ధ్వంసమైపోయినా, గుణాత్మకంగా భావరూపంలో వుండే కుర్చీ మనిషి మనస్సులో స్థిరంగా వుంటుంది. వస్తు జగత్తుకు దేశ కాలా లుంటాయి. కాని భావ జగత్తుకు కాలమే వుంటుంది, దేశ ముండదు. బాహ్యప్రకృతి కలరూపు ఎట్టిదో ఎవరికీ ఎన్నటికీ తెలియక పోవచ్చు; కాని మానవుడు తన అంతః ప్రపంచపు కలరూపును బట్టి తదను రూపమైన బాహ్య ప్రపంచాన్ని ప్రకృతినుంచి సృష్టించు కొంటు న్నాడు. అందుకే మానవుని అంతర్—బాహ్య ప్రపంచాలు వేరు కావం టున్నాను. బాహ్య ప్రపంచం దృశ్యం; మానవుడు—అంటే మానవుని అంతః ప్రపంచం—ద్రష్ట. ద్రష్ట—దృశ్యం అవినాభావ సంబంధం కలిగి వుంటాయి; ఒకరకంగా చెప్పుకోవాలంటే ద్రష్ట, దృశ్యం ఒకటే. దీన్నే నీవు ఆధ్యాత్మిక వాదమనో భావ వాదమనో అంటే, నీ భౌతిక వాదంకన్నా అదే యథార్థం అనవలసి వస్తుంది. అసలు నీ వెర్రికానీ భావవాద మేమిటి? భౌతిక వాదమేమిటి? ఈ రెండూ ఒకటి కాదంటావు;

మరి నీది సిసలైన ఏకతావాద మంటావు. విడ్డూరంకాదూ ఇది?

నే : అయితే నీవనేది భావ—భౌతిక వాదాలు లేవనా? లేక రెండూ ఒకటే అనా?

దే : భావ—భౌతిక వాదాలు రెండూ ప్రకృతిని అవగాహన చేసుకొనే క్రమంలో నీవు కల్పించుకొన్న రెండు అర్ధసత్యాలు; ఒకే నాణెంయొక్క బొమ్మా బొరుసూ; ఒకే సత్యాన్ని ఇద్దరు వేర్వేరు కోణాలనుంచి దర్శించటం తప్ప మరేమీకాదు.

నే : అలా దర్శించటం దేనివల్ల జరుగుతుం దంటావు?

దే : మానవుని ప్రపంచం చాలవరకు అధశ్చేతన పరిధిలోనిదే అనిచెప్పాను కదా ఇందాకనే. ఇద్దరు విభిన్న వ్యక్తుల సహజాత వాసనలు పరిసర ప్రభావాల సంయోగంతో కల్పించిన వికారాలే భావ—భౌతికవాదాలు. వాస్తవానికి ఆ రెంటికీ సహజవైరుధ్యం లేదు. ఉన్న వైరుధ్యం కృతకం.

నే : తెగిపోయిందేమో అనుకొన్న దారం మళ్ళీ అతుక్కుంది. తిరిగి మన సంభాషణ రావలసిన చోటికే—నైతిక సమస్యాపరిష్కారం వద్దకువచ్చింది. మరి, ఇంత బలీయమై కనపడకుండానే ఇన్ని మారాముళ్ళు కల్పిస్తున్న అధశ్చేతనను అదుపులో పెట్టుకోవటం బలహీనమైన చేతన చేతిలోని పని అయినట్లు చెబుతున్నావు కదా?

దే : ఎంత సేపటికీ అదుపు. అధికారం లాంటి పదజాలం ప్రయోగిస్తేతప్ప నీకు కుతి తీరదా యేమిటి? చూడు—నీచేతన స్వతంత్రతను వాంఛిస్తుంటే, నీ అధశ్చేతన పరతంత్రతను కాంక్షిస్తున్నది? ఇక్కడ అదుపుల అధికారాల ప్రసక్తి లేదు. పోతే అధశ్చేతనకూ నాడీమండలానికీ మధ్య సయోధ్య ఆదినుంచి వున్నదే కనుక జరగవలసింది చేతనకూ, అధశ్చేతనకూ మధ్య సయోధ్య మాత్రమే అనుకొంటే చాలు. సయోధ్య అంటే సహకారమన్నమాట. ఇందుకు పథకాలు ఆలోచించ గలశక్తి చేతన కున్న దన్నానుకదా? నేననటంకాదు. కాస్త ఆలోచిస్తే నీకైనా తెలియరాని నిగూఢ రహస్యం కాదు.

నే : అదే నీతో వచ్చిన చిక్కు. నాకు తెలియనిది తెలుసునన్నట్లు మాట్లాడ తావు.

దే : హిప్నాటిజం, హిప్నోపీడియా, సైకోథెరపీ లాంటి మనః ప్రక్రియ

లను గురించి విన్నావుకదా.

నే : వినటమే కాదు. వాటిని గురించి కొద్దిగా చదివాను కూడా. హిప్నాటిజం ప్రదర్శన సైతం చూశాను. అయితే?

దే : హిప్నాటిస్టు ప్రభావంలో మనస్సు ఎలాంటి విచిత్ర పరిస్థితికి లోనవుతుందో స్వయంగా గమనించి వుంటావు. ఇక్కడ చేతన పూర్తిగా నిద్రించినట్లు కనిపించదు. హిప్నాటిస్టు బహిరంగంగా ఇచ్చే ఆజ్ఞలను నేరుగా అధశ్చేతన గ్రహించి, మనో వృత్తిలోనూ దేహ ప్రవృత్తిలోనూ అంతర్గత జీవకార్యాలలోనూ ఆ ఆజ్ఞల కనుగుణమైన మార్పులను రప్పించు కొంటుంది.. హిప్నాటిజం ద్వారా మనస్సు అంతరాంతరాల్లో ఏనాడో పాతుకుపోయిన అనేక వ్యాధులను నివారించటం, మత్తు లేకుండా ఆపరేషను జరపటం వంటివి జగద్విదితమే కదా. సైకోథెరపీలో ఔషధ చికిత్సాదుల ప్రమేయం లేకుండా నిద్రారంభంలో చేతన ద్వారా అధశ్చేతనకు జరిగే సూచన మూలంగా ఎన్నో దీర్ఘ వ్యాధుల నివారణ జరుగుతున్నది. అదేవిధంగా నిద్రా సమయంలో జాగ్రదవస్థలో కన్నా కనీసం పది - పదిహేను రెట్ల వేగంగా జ్ఞానసముపార్జనం చేసే పద్ధతి హిప్నోపీడియా. దీని ద్వారా కళాభిజ్ఞతను కూడా మనిషికి అలవరచవచ్చునని ప్రయోగాత్మకంగా తేల్చారు. హోమియోపతి చికిత్సా విధానంలోకూడా అధశ్చేతనకు చెందిన మనోవికారాలే అత్యంత ప్రాధాన్యం వహిస్తాయి. ఇలాంటి వాస్తవాంశాలను దృష్టిలో వుంచుకొంటే మానవుని నైతిక సమస్యకు పరిష్కారమార్గం యీ ప్రక్రియలో లభించవచ్చు ననిపించటం లేదూ?

నే : ఇవి కొన్ని చిట్కాలుగా ఉపయోగపడుతున్న మాట వాస్తవమే కావచ్చు. అంతమాత్రాన అవి నైతిక సమస్యకు పరిష్కార మార్గాన్ని అందిస్తాయనటానికి ఆధారమేమిటి?

దే : వీటిని చిట్కాలుగా పరిగణించే నీ మేధాశక్తిని మెచ్చుకో వలసిందే. సరే, నీతి అంటే ఏమిటి? మానవుని అంతఃకరణానికి జరిగే విజ్ఞాపనగా నీతిని నిర్వచిస్తున్నదికదా మీ తత్వం? అంతఃకరణంపరిశుద్ధం కాగలిగితే తప్ప మానవుడు నీతిమంతుడుగా ప్రవర్తింప జాలడని తేలటం లేదూ?

నే : నిజమే. కాని నీవు చెప్పిన ప్రయోగాలు అంతఃకరణాన్ని నైతికంగా పరిశుద్ధం చెయ్యటానికి ఉపయోగ పడుతున్నట్లు సాక్ష్యాధారం వుందా లిగా.

దే : నేను పేర్కొన్న ప్రక్రియలే కానవసరం లేదు. అంతరంగిక నైతిక ప్రబోధానికి యోగసాధనను ప్రయోగించుకోవచ్చు కదా. అందువల్ల సత్ఫలితాలు సమకూరగల వనిపించటం లేదూ?

వే : హిప్నాటిజం ఒకరు మరొకరిపై ప్రయోగించేది కాగా, యోగసాధన తనను తానే హిప్నటైజ్ చేసుకోవటం. అందుకే దాన్ని సెల్ఫ్ హిప్నాటిజం అన్నాడు మా అబ్రాహామ్ కోవూరు.

దే : అయితేనేం? హిప్నాటిజం ద్వారా నిద్రను కల్పించి అధశ్చేతనచే అద్భుత కార్యాలు సాధించగలుగుతున్నప్పుడు మనిషి యోగసాధనతో తనకు తానే నిద్రను కల్పించుకొని తన అధశ్చేతన ద్వారా అంతఃకరణాన్ని నైతికంగా పరిశుద్ధం చేసుకోవటం అసాధ్యమని ఎందుకనుకుంటావు? సంకుచితంగా ఆలోచింపదగిన అంశం కాదిది.

వే : యోగుల నిజాయితీని శంకించటం సంకుచితమా? ఈనాడు యోగులు అవినీతికి కేంద్రాలుగావున్నారన్నది నిర్వివాదాంశం. ముంజేతి కంకణానికి కూడా అద్దం కావాలా యేమిటి? వారి యోగసాధన వారి ప్రవర్తననేమాత్రం ప్రభావితం చెయ్యగలిగింది? నీ వాదన నిరాధార మనటానికి ఇదొక్కటి చాలదా?

దే : ఈనాటి యోగులు చాలవరకు మానవాతీత శక్తుల సాధనను మరణానంతర మోక్షసాధనను ఆశయంగా పెట్టుకొని యోగాభ్యాసం సాగిస్తున్నారు. అందువల్ల రెంటికి చెడ్డ రేవళ్ళవుతున్నారు. వీరిలో లోకాన్ని వంచించపూనే వేషధారులు కూడా లేరనను. వారిలాగా కాక—చేతన ద్వారా సత్సంకల్పాన్ని తలపెట్టి అధశ్చేతనకు సూచించే శిక్షణ యోగాభ్యాసానికి లక్ష్యమైతే తప్ప అంతఃకరణశుద్ధి సాధ్యంకాదు. అది సాధ్యమైనప్పుడు అంతఃకరణానికి విజ్ఞాపన సవ్యంగా జరుగుతుంది. అంతఃకరణం—అంటే అంతరంగం—జాగృత మవుతుంది. నైతికాచరణకు మూలమైన అంతఃకరణాన్ని ఉద్బుద్ధం చెయ్యాలన్న సత్సంకల్పంతో చేతన యోగాభ్యాస ప్రక్రియకు పూనుకోవటం ముఖ్యం. అప్పుడే మనస్సు యొక్క అంతరాంతరాల మధ్య సయోధ్య, సాధించే మార్గం సుగమ మవుతుంది. ఈ ప్రయత్నానికి పూనుకొనే మనుషుల సంఖ్య పెరిగే కొద్దీ నైతిక సమాజానికి వేళ్ళు పాతుకొంటూ వుంటాయి. అంతేకాని, ఊరక పైపై కబుర్లతో ఊకదంపుడు ఉపన్యాసాలతో పరి

ష్కార మయ్యేది కాదు నైతికసమస్య. యోగమంటే దేహారోగ్యానికి దోహదపడే ఆసనాలే అనుకోవద్దు; మానసికారోగ్యానికి కూడా మార్గమే.

నే : ఆ పని ఏనాడైనా ఏ యోగి అయినా చేసి వుంటే నువ్వు చెప్పేది నమ్మవచ్చు. కానీ....

దే : ఒక్కరేమిటి? గౌతముడు బుద్ధుడై సిద్ధార్థుడు కాగలిగింది, వర్ధమాన మహావీరుడు జినుడు కాగలిగిందీ యోగసాధన మూలంగానే. ప్రాచీన కాలంలో బౌద్ధులు, జైనులు వగైరాలు చేసిందదే. వీరంత నాస్తికులే అన్నది మరవవద్దు. నైతిక ప్రవర్తన కవసరమైన సంయమానికి యోగమే సాధన మయింది వీరికి. వాదన కోసం ఇంతవరకు ఎవ్వరూ ఇదిచేసివుండ రనుకుందాం. అంతమాత్రాన సాధ్యా సాధ్యాలను ఉచితానుచితాలను నిర్ణయించటంలో నీ బుద్ధి ప్రమాణ మేమయింది? నీవు ప్రచారం చేసే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఎవరైనా ఎక్కడైనా పెద్ద పెద్ద రాజ్యాలలో అమలు జరిపారా? మరి నువ్వెందుకు ప్రచారం చేస్తున్నావు అదేదో ఆచరణ సాధ్యమైనట్లు?

నే : నేను ప్రచారంచేసే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం చారిత్రికానుభవం నుంచి తార్కికంగా నిష్పన్నమయింది.

దే : మరి యోగ సాధనో? హిప్నాటిస్టు ఇతరులకు నిద్ర కల్పించి వారి క్లేశాన్ని నివారించగలుగు తున్నప్పుడు యోగి స్వయం కల్పిత నిద్ర వల్ల తన మనో మందిరాన్ని అనుకొన్న తీరులో అలంకరించుకొనే అవకాశంలేదా? ఈ ఉపపాదన తార్కికం కాదా?

నే : ఇది వూహించుకోటానికి బాగానే వుండవచ్చు. కాని యోగశక్తి నమ్మశక్యంకాని విషయం.

దే : పెద్ద హేతువాదివని చెప్పుకుంటావు. నీ ప్రత్యక్ష ప్రమాణాన్ని కూడా నీబుద్ధి ప్రమాణం ఆమోదించ దన్నమాట.

నే : ఇందులో ప్రత్యక్షప్రమాణ మేముందికాబట్టి నా బుద్ధి ప్రమాణానికి ఆమోదయోగ్యం కాకపోవటానికి?

దే : 1947 మే నెలలో పెదర్లంకలో జరిగిన మీ అధ్యయన శిబిరంలో పగటి భోజనం తర్వాత పవ్వళించబోయిన బ్రహ్మానంద బాలయోగికి నడి వీపున పెద్దతేలు కుట్టింది. గుర్తుందా? ఆయన ఆ రోజుల్లో తెనాలి దగ్గర కటీవరంలో వుండేవాడు.

నే : అవును. ఆయన తనంతట తానుగా లేచేదాకా ఎవ్వరూ నిద్రాభంగం కలిగించకుండా ఏర్పాటు చేయించుకొని స్వయంగా నిద్రను కల్పించుకొన్నాడు. ఏ రెండుగంటల పాటో నిద్రపోయి తర్వాత మామూలుగానే తరగతులకు హాజరయ్యాడు.

దే : తేలుకుట్టిన బాధనుంచి తేరుకోవటమే ఆ సమయంలో ఆయన యోగ సాధనకు లక్ష్యం. అందులో తాను కృతకృత్యు డయ్యాడు. అలాగే యోగి తన స్వయంకల్పితనిద్రకు, అంటే యోగసాధనకు, ఎంతటి మహత్తరలక్ష్యాన్నైనా ఎన్నుకోవచ్చు. మనస్సుయొక్క ఉపరితలంలో వుండే చేతనకూ అంతరాంతరాల్లోని అధశ్చేతన నాదులకూ సయోధ్య సాధించటాన్నే లక్ష్యంగా ఎన్నుకోవచ్చు. ఈ లక్ష్యంతో యోగాభ్యాసం సాగినప్పుడు నీ నైతికసమస్యతో పాటు ఎన్నో ఇతర సమస్యలకు కూడా పూర్తి పరిష్కారం లభించే అవకాశముంది.

నే : సమస్యల పూర్తి పరిష్కారం అనుభవవిరుద్ధ మైన అంశం. ఎందుకంటే నాకు ఒక సమస్య పరిష్కార మయ్యేసరికి కొత్తవి పది పుట్టుకొస్తున్నాయి. ఇంకెక్కడి పరిష్కారం?

దే : ఈ సమస్య లన్నీ నీవు కల్పించుకొన్నవే. నీ కర్తృత్వాన్ని నీవు గుర్తించలేక పోవటంవల్లనే ఆ సమస్యలు నీ మీద అధికారం చలాయిస్తున్నాయి. నీవు బెంబేలు పడిపోతున్నావు. నేను మొదట్లోనే చెప్పానుకదా! నీ కర్తృత్వాన్నీ నీ అధికార శక్తినీ నీవు గుర్తించిన నాడు నీ సమస్యలన్నీ వాటంతట అవే పటాపంచలవుతాయి.

నే : నా సమస్యలు నేను కల్పించుకొన్నవే అనటంలో అర్థంలేదు. నాకు తెలియ కుండానే యీ సమస్యలు కూడుకొంటున్నాయి. అందువల్ల వీటి విషయమై కర్తృత్వం నా దెలా అవుతుంది? కర్తృత్వం నాది కానప్పుడు వీటిపై అధిపత్యం ఎలా వుంటుంది నాకు?

దే : బలే మానవవాది వయ్యా! కర్తృత్వాధిపత్యాలు నీవికాక ఇంకెవరివంటావు? అధిపత్యం నీదైతే నీవు స్వతంత్రుడివి; నీదికాకపోతే పరతంత్రుడివి. స్వాధికారం స్వేచ్ఛ; పరాధికారం దాస్యం. స్వేచ్ఛాతత్త్వమని నీవు వేనోళ్ళ చాటుకొనే నవ్య మానవవాదం నీకు సమస్యాబంధాల నుంచి విముక్తి కలగచెయ్యలేని దాస్యతత్వమే అన్నమాట నీయోచన ప్రకారం?

నే : అదికాదు; మానవుడు దాస్య బంధాలతో జన్మిస్తున్నాడు. స్వేచ్ఛకోసం తపనపడుతున్నాడు. బంధం సిద్ధం; బంధ విముక్తి సాధ్యం. కాబట్టి వివిధ బంధాలతో చిక్కుకొనివున్న మానవుడు జ్ఞానం సాయంతో బంధ విముక్తిని సాధించు కొంటున్నాడు. ఈ బంధాలనే నేను సమస్య లంటున్నాను.

దే : సమస్యా బంధాలు లేవనికాదు; నీ సమస్యల్ని సమస్యలుగా గుర్తించి భయ భ్రాంతులకు లోనుకావటం వల్లనే అవి నిన్ను పీడిస్తున్నా యంటున్నాను. వాటిని గుర్తించకపోతే సమస్యలూ లేవు; పీడలూలేవు.

నే : గుర్తించనంత మాత్రాన ఉన్న సమస్యలు లేకుండా పోతాయా?

దే : గుర్తిస్తే గోరంతలు కొండంతలవుతాయి; గుర్తించకపోతే కొండంతలు గోరంత లవుతాయి. స్వర్గాన్ని నరకం చేసేదీ నరకాన్ని స్వర్గం చేసేదీ మనస్సే అన్న సాటన్ సూక్తి తెలియదా? తన సంతోషమె స్వర్గము తన దుఃఖమె నరక మని మీ బద్దెభూపాలుడు కూడా చెప్పాడుకదా?

నే : నీ వేమైనా చెప్పు ప్రాకృతికంగానూ, సామాజికంగానూ, శారీరకం గానూ, మానసికంగానూ, ఎప్పటికప్పుడు ఎన్నో సమస్యలు నన్ను కందిరీగల దండులాగా ముసురు తున్నాయి. ఇందులో నా ప్రమేయం లేదని ఘంటాపథంగా చెప్పగలను. ఇది నా అనుభవంలోని విషయం. నా సమస్యల్ని అధిగమించాలంటే నా అనుభవాన్ని మిధ్యగా కొట్టి వేసుకోవా లంటావు. అంతేగా?

దే : నీ మూర్ఖత ఇంతవరకు ఎంతమాత్రం చెక్కుచెదరలేదు. మానవుడు తన భవితవ్యానికి తానే కర్త అని నీ తత్వం చెబుతున్నది. చిత్రకారుడు అతిభయంకరమైన యక్షుని రూపాన్ని చిత్రించి, దానిని చూచి తానే భీతచిత్తు డవుతున్నట్లుగా యీ ప్రపంచంలో అజ్ఞుడు అతి భయంకర మైన పరిస్థితిని సృష్టించుకొని తన సృష్టిని చూచి తానే భయభ్రాంతుడవుతున్నాడు అని మీ నాగార్జు నాచార్యుడు ఏనాడో చెప్పాడు. అలా నీ ప్రపంచానికి చెందినంత మేరకు నీవే సమస్తం. నీవే సర్వజ్ఞుడవు; నీవే సర్వశక్తిమంతుడవు. నీవే సర్వ వ్యాపకుడవు; నీవు లేకుండా నీ ప్రపంచంలేదు.

నే : మళ్ళీ మిథ్యావాదన మొదలు పెట్టావూ? ప్రపంచం లేకుండా నేమన్నా నంటావా? నేనుండటం వల్లనే యీ ప్రపంచం వున్నదంటావా? ఇది వట్టి శుష్క వేదాంతం!

దే : నీకు భాషా జ్ఞానం కూడా లేదన్నమాట. నీవు లేకుండా నీ ప్రపంచం లేదంటున్నాము కాని అసలు ప్రపంచం లేదన్నానా? నీ జ్ఞాన పరిధి లోకి—నీ అనుభూతిలోకి—ప్రపంచంలో ఎంత భాగమైతే వస్తున్నదో అది మాత్రమే నీకు వాస్తవం. నీ జ్ఞానానుభూతులకు బాహ్యంగా నీవున్న దనుకొనే ప్రపంచం ఎంతైనాకానీ—అనంతమే కావచ్చు—అదినీకలేని దాని కిందే లెక్క. నీవన్నా నీ ప్రపంచమన్నా ఒకటే. ఇక్కడ ద్వైతా నికేమాత్రం తావులేదు. నీవూ నీ ప్రపంచం వేరను కోవటమే ద్వైతం. నీవు లేకుండా నీ ప్రపంచం లేదు. నీ ప్రపంచం కాకుండా నీవు లేవు. కనుక ఈ విస్తృతార్థంలో నిన్ను నీవు గుర్తించిననాడు నీవు నన్ను గుర్తించినట్లే. అప్పుడు నీవూ నేనూ అన్న వ్యత్యాసం లేక, నీవు దేదీప్యమానంగా వెలుగొందుతావు. ఆ దివ్యజ్యోతి ముందు నీ అయోమయ భయాంధకారాలు పటాపంచలవుతాయి. కాబట్టి నీ ఆత్మ ప్రపంచం, నీ బాహ్య ప్రపంచం వేరు వేరన్న భ్రాంతిని ముందు వదలి వెయ్యి. నీ చేతన, అధశ్చేతన విరుద్ధాలన్న భ్రమకు లోను కావద్దు. అది జరిగిననాడు నిన్ను పీడించే సమస్యలన్నీ మటుమాయ మవుతాయి. కనుక నీవు ప్రస్తుతం గురి పెట్టవలసింది బాహిర ప్రకృతి విజయానికి కాదు; అంతరాత్మ విజయానికి. అది సాధ్యమయ్యే దాకా నిన్ను నీవు పాలించుకోలేవు. నీ క్రీనీడనైన నేను నిన్ను పాలిస్తుంటాను.

నే : ఈ మెట్టవేదాంతంతోనే యీ దేశం ఇంతవరకు సర్వనాశన మవుతూ వచ్చింది; ఇక నీ బోధ నా కవసరంలేదు. ఇప్పటికే నా అమూల్యమైన కాలం చాలా వృధా అయింది. ఇక మాటలు కట్టిపెట్టి నీవు దయ చేయవచ్చు.

దే : మూర్ఖుడా! ఇక నిన్ను ఉద్ధరించగల శక్తి యీ లోకంలో లేదు. నీ మిథ్యా లోకంలో నీవు కల్పించుకున్న సమస్యాభూతాల మధ్య నలిగి చావు. నేను వెళుతున్నాను.

• • •

ప్రళయకాల గంభీర గర్జన. ఉలికి పాటుతో మెలకువ వచ్చింది. కన్నది కలయే కదా అన్న ఆకలింపుతో కలవరపాటు క్రమంగా తగ్గిపోయింది. కలలో దేవుడు కరిగి పోయాడు. నా చుట్టూ అంతటా కన్ను

పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. ఆ గాఢాంధకారంలో నేను తప్ప అంతా శూన్యమేనేమో అనిపించింది. కలలో తేలిన విలువైన విలువల్ని గూర్చి తలపోస్తూ అలాగే కళ్ళు తెరిచి పడుకున్నాను. ఇంతలో తూరుపు రేకలు తొంగి చూసినై. ఆ వింత కాంతిలో ఒక వినూత్న ప్రపంచం వెలుగులోకి రావటం మొదలు పెట్టింది. నవనవోన్మేషంగా విస్తరిస్తున్న ఆ దృశ్యమాన సర్వ ప్రపంచం నా ప్రతిబింబమేనేమో అనిపించింది.

---

మంచివారిని సృష్టించటం కోసమై ముందుగా మంచి సమాజాన్ని రూపొందించటానికి గొప్పవారు అవసరమనుకోవటం వల్ల లాభంలేదు. ఈ ప్రపంచాన్ని మంచిదానిగా మార్చగల వారు మంచివారే కాని గొప్పవారు కాదు. నిజానికి ప్రపంచాన్ని ప్రస్తుతదుస్థితికి తీసుకవచ్చినవారు కచ్చితంగా గొప్పవారే. మనం మంచివారిని కోరుకుందాం. మంచివాడిలా జీవించాలనుకొనే వాడే నవ్యమానవవాది. గొప్పవారిచేత ఇలా భ్రష్టపరచబడ్డ యీ ప్రపంచంలో కొద్దిమంది మంచి వాళ్లు కృషిచెయ్యగలిగితే అవే ఆశాజనకమని నే నంటాను.

- ఎమ్. ఎన్. రాయ్

---

'రాడికల్ హ్యూమనిస్ట్' లో
నా సంపాదకీయాలు

నవంబరు 1982

# రాడికల్ హ్యూమనిస్టులు పునర్జన్మ ఎత్తాలి

కాంతి తూర్పునుంచి పడమటికి ప్రసరిస్తుందని తెలుసు. జ్ఞానాన్ని కాంతితో పోలుస్తారు; కాని చారిత్రకంగా చూస్తే జ్ఞానం తూర్పునుంచి పడమటికి ప్రసరించినట్లు కనబడదు. కాంతి తూర్పునుంచి పడమటికి ప్రసరిస్తుందన్న వాస్తవాన్ని ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి సారిగా రుజువుచేసిన గౌరవం మనం దక్కించుకోవాలి—ఈ మాటలు 1946 మేలో రెండో డెహ్రాడూన్ అధ్యయన శిబిరంలో ఎమ్. ఎన్. రాయ్ అన్న మాటలు ఎంతటి ఆత్మ విశ్వాసం! ఎంతటి ఆశావాదం! ఆజన్మాంతం అలసత్వ మెరుగని ఆశావాదిగానే జీవించాడు రాయ్.

జంతు దశనుంచి వేరైన మానవుణ్ణి అతనిలోని వివేకాత్మకమైన జిజ్ఞాస ఆగడా పట్టి ముందడుగు వేయిస్తున్నదని రాయ్ క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాడు. జిజ్ఞాసా జనితమైన జ్ఞానానికి అధికారశక్తి వుంది వ్యక్తి యొక్క అధికార శక్తినే స్వేచ్ఛ అంటాం. జ్ఞానంవల్ల స్వేచ్ఛ లభిస్తే స్వేచ్ఛ ఇతోధికమైన జ్ఞానానికి దోహదమవుతూ వచ్చిందని ఆయన చారిత్రకంగా దర్శించాడు. అందుకే స్వేచ్ఛా పిపాస, సత్యాన్వేషణ మానవునికి సహజ సిద్ధమైన ప్రేరణలని సిద్ధాంతీకరించాడు. కనుకనే మానవునిలోని వివేకం (Reason) చూపే వెలుగుబాటల్లో వికాసం (Romanticism) విజృంభిస్తే, విప్లవం (Revolution) వస్తుందని చారిత్రకంగా వివరించి చూపాడు రాయ్.

తార్కిక పర్యవసానంగా తనలో యేర్పడ్డ యీ తాత్విక నిర్ణయం అవసాన దశలోకూడా ఆయనని వీడలేదు. పార్టీ విధానంలోని సమష్టితత్వ ప్రమాదాన్ని పసికట్టి 1948 డిసెంబరులో రాడికల్ డెమోక్రాటిక్ పార్టీని రద్దుచేసుకొని రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమం స్థాపించాడు. అయిదేళ్ళ అనంతరం మరణశయ్యమీద వుండి, ఉద్యమ స్వరూపాన్ని వివరిస్తూ సుదీర్ఘ వ్యాసం డిక్టేట్ చేశాడు రాయ్. పత్రికలూ, రినైజాన్స్ ఇన్స్టి

ట్యూట్లూ, అధ్యయన శిబిరాలూ, రచనాలూ, ఉపన్యాసాలూ మాత్రమే హ్యూమనిస్టు ఉద్యమానికి పట్టుకొమ్మలనీ, అంతకంటే అదనంగా నిర్మాణాత్మకమైన చర్యలు అవసరం లేదనీ అన్నాడు. జ్ఞానానికున్న కార్యకరణ శక్తి ఎంతటిదో రాయ్‌కి అర్థమయిన దాంట్లో శతాంశంకూడా అర్థం చేసుకోలేని వారిచేతుల్లో చాలచోట్ల ఉద్యమ నాయకత్వం పడిపోయింది. ఇది నిజంగా దురదృష్టకరమైన సంఘటన.

1962 లో ఒక సందర్భంలో ఉద్యమ నిర్మాణంపట్ల రాయ్ నిర్ణయాన్ని మెదడు దెబ్బతిన్న దశలో అన్నమాటగా అవహేళన చేశాడు ఒక ఆంధ్రి నాయకుడు. మనం అధికార రాజకీయాలకు వ్యతిరేకం కాని పార్టీ రాజకీయాలకు కాదనీ, యీ విషయంలో రాయ్ మనలను తప్పుదారి పట్టించాడనీ కూడా ఆ నాయకుడు వాదించాడు. పదిమంది మాత్రమే సమావేశమైన ఆ సభలో ఆ వాదనను నేను తీవ్రంగానే ఎదుర్కోవలసి వచ్చింది.

ఏమైనా రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమం—ముఖ్యంగా ఆంధ్రాలో—తన రాజకీయపు రంగును చెరిపి వేసుకోలేక పోయింది. అందువల్ల ఉద్యమ నాయకుల్ని హ్యూమనిస్టు ఉద్యమానికి భిన్నమైన ఇతర అంశాలే ప్రముఖంగా ఆకర్షిస్తూ వచ్చినవి. రాడికల్ హ్యూమనిస్టులు వాస్తవానికి తమ ఉనికిని, మనికిని తరచు మరచి పోవటమే జరుగుతూ వచ్చింది. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాస్వామ్యానికీ, కమ్యూనిస్టు వ్యవస్థలో కమ్యూనిజానికి పట్టిన దుస్థితిలాంటిదే ప్రస్తుతం రాడికల్ హ్యూమనిజానికికూడా పట్టిందా అనిపిస్తున్నది. దీనికి తరణోపాయం లేదా? మళ్ళీ మరోసారి రాడికల్ హ్యూమనిజాన్ని మననం చేసుకొని, ఆత్మ విమర్శ చేసుకోగల ఆత్మ స్థైర్యాన్ని ప్రదర్శించగలిగితే తరణోపాయం దొరికినట్లే.

ఆ రెండో డెహ్రాడూన్ అధ్యయన శిబిరంలోనే "రాడికల్ డెమోక్రాట్లలో చాలమందిమి వివేక స్థాయిలో హేతువాదులం, ఉద్వేగ స్థాయిలో జాతీయవాదులం, తత్త్వస్థాయిలో శుష్కమనస్కులం అయిపోయా"మని ప్రమాద సూచకంగా రాయ్ హెచ్చరిక చేశాడు. ఆ హెచ్చరిక నేటి రాడికల్ హ్యూమనిస్టులకు కూడా వర్తిస్తుంది.

ఏమైనా యీ రెండు దశాబ్దాలలో రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమం—ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో—దాదాపు మరణించిందనే అనిపిస్తున్నది. అది పునర్జన్మ ఎత్తాలి. అందుకు ఒకటే మా[illegible] ఎన్, రాయ్‌ని

గ్రంథాలయ
89591
A.C

మళ్ళీ ఒకసారి అధ్యయనం చేయాలి; అవగాహన చేసుకోవాలి; అవసరమైన కొన్నిచోట్ల ఛేదించ గలగాలి; రాయ్ ఆశించినట్లుగా స్వతంత్ర జిజ్ఞాసువులం కాగలగాలి. అలా భావ విప్లవాన్ని విస్మరించకుండా కార్య సాధనకుపక్రమించాలి. రాడికల్ హ్యూమనిస్టుల మనుకొనే వారంతా ఎక్కడి వారక్కడే పునరాలోచన చేసుకొని పునర్జన్మ ఎత్తటానికి పూనుకోవాలి. ఈ విషయం మననం చేసుకొన్న మరుక్షణం నుంచే ఉద్యమం కొత్త ఊపిరిపోసుకొని, కొత్త ఊపు అందుకొంటుంది. అప్పుడే, రాయ్ ఆశించినట్లు విజ్ఞానకాంతులు తూర్పునుంచి పడమటకు ప్రసరించేది.

డిసెంబరు 1982

# పార్టీ X ఉద్యమం

"రాడికల్ హ్యూమనిస్టులు పునర్జన్మ ఎత్తాలి" అన్న నవంబరు సంచిక సంపాదకీయం సంకల్పించిన పని సఫలమయినట్లే. సంఘసభ్యులు పలువురు పలురకాలుగా రియాక్ట్ అయ్యారు. రియాక్టుకావటం తప్పనేవారు కూడా రియాక్ట్‌కావటం విశేషం. రాడికల్ హ్యూమనిస్టులను కవ్వించి కార్యాలోచనకు పురికొల్పటమే ఆ సంపాదకీయం ధ్యేయం. ఇందులో కవ్వించే భాగం పూర్తయింది; అంటే సగం విజయం సాధించినట్లే. ఇక మిగిలింది కార్యాలోచన. అనుకోవాలేకాని అది అసాధ్యం కాదు.

భారతదేశం వంటి వర్ధమాన దేశాల్లోని ప్రజల్లో అధిక సంఖ్యాకులు దూరదృష్టి లేక, సమయోచిత జ్ఞానం లేక, పార్టీనాయకుల అధికార రాజకీయాల వలల్లోచిక్కి గిలగిల కొట్టుకొంటున్న దీర్ఘ సూత్రులే. దూర దృష్టి లేక వలల్లో చిక్కినా, సమయోచిత జ్ఞానంతో ప్రమాదస్థితి నుంచి బయటపడగల ప్రాప్త కాలజ్ఞులు అల్పసంఖ్యాకులు. పార్టీనాయకులను ప్రజలకు వలలు పన్నే జాలరులుగా పసికట్టి గతానుభవాన్ని పురస్కరించుకొని దూరదృష్టితో కర్తవ్యాన్ని గుర్తించగల రాయ్‌లాంటి దూరదర్శులు అరుదు.

దీర్ఘసూత్రులైన సామాన్య ప్రజలు తనలాగ దీర్ఘ దర్శులుగా మారే శుభదినం కోసం ఆరాట పడ్డాడు ఎం. ఎన్. రాయ్. అందుకే రాడికల్ డెమోక్రాటిక్ పార్టీని రద్దుచేసుకొని, అమాంతం రాడికల్

హ్యూమనిస్టు ఉద్యమాన్ని నెలకొల్పాడు. ఈ చర్య సముచితమని కొందరూ, కాదని కొందరూ విభిన్నంగా ఆలోచించేవారు అప్పటినుంచి ఇప్పటివరకూ వుంటూనే వున్నారు.

ఉద్యమ నిర్మాణం సముచిత చర్య కాదనే వారిలో కూడా భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. తాత్విక చింతనకూ, అధికార వికేంద్రీకరణకూ రాజకీయ పార్టీ అవరోధం కాదని ప్రొఫెసర్ ఏ.బి. షా లాంటివారి అభిప్రాయం. సహజాత వాసనల్లో సముదాయతత్వం ఒకటనీ, దాన్ని చంపటానికి అసహజం కనుక దాన్ని సద్వినియోగ పరచుకోవటమే సరియైన సరళి అనీ యీ కోవకు చెందినవారు వాదిస్తారు. నిర్మాణాత్మకంగా కుల సంఘాలు వున్న ఆ రోజుల్లో కంటె కుల సంఘాలు లేని యీ రోజుల్లో కులతత్వం విపరీతం కావటమూ, మనకు రాజకీయపార్టీ లేని యీ రోజుల్లో కంటె రాజకీయపార్టీ వున్న ఆ రోజుల్లోనే తాత్విక చింతన వైపు ఎక్కువ మొగ్గు కనిపించటమూ గమనిస్తే—షా వాదాన్ని అంతతేలిగ్గా కొట్టివేయ రాదేమో అనిపిస్తుంది. మానసికంగా మరగుజ్జులు విరివిగా వున్న దశలో భావోద్యమం ఎంతవరకు పనికి వస్తుందన్నది చర్చించ వలసిన విషయమే.

పార్టీ మనుషులు ఒక్కసారిగా ఉద్యమ మనస్తత్వం అలవరచుకోవటం కష్టసాధ్యమనీ, ఆ స్థాయికి వైజ్ఞానికంగా ఎదిగినా నైతికంగా ఎదగటం దుస్సాధ్యమనీ మరికొందరి అభిప్రాయం. దీర్ఘ సూత్రులు ప్రాప్తకాలజ్ఞత అలవరచుకోకుండా ఒక్కసారిగా దీర్ఘదర్శిత్వం సాధించటం సాధ్యం కాదేమో అని వీరి సంశయం. కాబట్టి రాడికల్ డెమోక్రాటిక్ పార్టీని రద్దు చేసుకొన్నప్పుడు మధ్యేమార్గంగా రాడికల్ హ్యూమనిస్టు సంఘాన్ని నెలకొల్పి వుండవలసిందనీ, చివరి మెట్టుగా భావోద్యమాన్ని భావించివుంటే బాగుండేదనీ వీరిభావం. అందువల్ల రాయ్ మరణానంతరం రాడికల్ హ్యూమనిస్టు సంఘం రూపొందటం మంచిదేనని వీరి వాదన.

పార్టీవైపు నుంచి ఉద్యమంవైపు వెళ్ళే మార్గంలో ఒక మజిలీగా రాడికల్ హ్యూమనిస్టు సంఘం అవతరించి వుంటే— బందాడటానికి పరుగెత్తటానికి మధ్య తప్పటడుగులాగా—అదొక తరిబీతుగావుండేది అనే వాళ్ళలో కూడా కొందరు నేటి రాడికల్ హ్యూమనిస్టు సంఘాన్ని సమర్థించరు. పార్టీ తర్వాత ఏర్పడే హ్యూమనిస్టు సంఘం హ్యూమనిస్టు ఉద్యమం వైపు పురోగమనచర్య అవుతుంది కనుక అది విప్లవాత్మక మనీ, హ్యూమ

నిస్టు ఉద్యమం తర్వాత ఏర్పడే హ్యూమనిస్టు సంఘం పార్టీవైపుకు తిరో గమనచర్య అవుతుందికనుక అది విప్లవప్రతిఘాతకమనీ, ఇది పరుగెత్తటం నుంచి తప్పటడుగుల్లో పడటమేననీ వీరి అభిప్రాయం. హైదరాబాదు నుంచి ఢిల్లీకి వెళ్ళేదారి ధనం (+) అయితే, ఢిల్లీనుంచి హైదరాబాదుకు వచ్చేదారి ఋణం (-) అవుతుంది కదా! ఒకే బిందువు ధన మార్గంలో వున్నదానికీ, ఋణ మార్గంలో వున్నదానికీ దిశనుబట్టి విలువలో గుణాత్మక మైన భేదం పొందుతున్నట్లే—పార్టీతర్వాత ఏర్పడే సంఘానికీ, ఉద్యమం తర్వాత ఏర్పడే సంఘానికి పొంతన బొత్తిగా వుండదని వీరి వాదం. వీరి దృష్టిలో నేటి హ్యూమనిస్టు సంఘం ఉద్యమం నుంచి పార్టీవైపుసాగే తిరో గమనమార్గంలో ఒక మజిలీ.

మరి ఉద్యమవాదుల వాదం మరో తీరుగా వుంటుంది. పార్టీ కానీ, సంఘంకానీ, ఉద్యమంకానీ మనిషికి బయట వుండవనీ, మనిషి మస్తిష్కం లోనే స్థావరమేర్పరచుకొని వుంటాయనీ, రాజకీయ మనస్తత్వంకల వ్యక్తి ఉద్యమంలో వున్నా అతడు పక్షీయుడేననీ, తాత్విక మనస్తత్వం కలవ్యక్తి పార్టీలోవున్నా అతడు ఉద్యమకారుడే అనీ వీరి అభిప్రాయం. బుద్ధుని నిర్వాణం కానీ, శంకరుని జీవన్ముక్తికానీ ఎలా బ్రతికి వుండగానే పొంద దగిన మానసికానుభూతులో—అలాగే పార్టీ తత్వంకానీ, ఉద్యమ తత్వం కానీ మనిషియొక్క మానసికానుభూతులే అని వీరి గాఢవిశ్వాసం.

వీరి వాదన ప్రకారం—పార్టీ, సంఘం లాంటి నిర్మాణాలన్నీ లాంఛన ప్రాయాలు; అవి పరిమాణాత్మకాలు. మనిషియొక్క వ్యక్తిగత మైన మానసిక స్థితి మాత్రమే గుణాత్మకమైనది. మానసిక స్థాయి అంటే కేవలం వైజ్ఞానిక స్థాయి కాదు; అంతకంటె వెయ్యిరెట్లు విలువైన నైతిక స్థాయి మాత్రమే మానసిక స్థాయికి గీటురాయి. ఉన్నతమైన నైతిక స్థాయి కలవాడు రాజకీయ పార్టీలో వున్నా మనిషిగానే ప్రవర్తిస్తాడు; అందులో ఇమడలేకపోతే బయటికొస్తాడు. అలాంటి స్థాయి లేనివాడు తాత్వికోద్యమంలో వున్నా అతడు మనిషిగా ప్రవర్తించ లేడు. మనో భావాలకు అనుకూలమైన వ్యవస్థా నిర్మాణం అవసరమే. అయితే మనో భావాలకు దృఢమైన ప్రాతిపదిక వుంటే తన కనుకూలమైన వ్యవస్థను అవే రూపొందించుకొంటాయి. యూరపులో రినైజాన్సు ఉద్యమం ఆధునిక

ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిరాయి వేసింది: మతపరమైన రిఫార్మిస్టు ఉద్యమ ప్రభావంవల్ల ఆ ప్రజాస్వామ్యమే లాంఛనప్రాయమై పోయింది. అంతేకాని ప్రజాస్వామ్య వ్యవస్థ రూపొందటంలో కానీ, రూపాంతరం చెందటంలో కానీ ఏ రాజకీయపార్టీ ప్రధానకారణం కాలేదు. అసలు పార్టీల పుట్టుక అంతా ఇటీవలే కదా? కాబట్టి ఇక్కడ అగ్రతాంబూలం, భావోద్యమాలకేకాని, సాంఘిక నిర్మాణాలది కాదు. భావోద్యమాన్ని విస్మరించి వ్యవస్థలకోసం ఎంత ఉదాత్తమైన సంస్థా నిర్మాణాన్ని వరించినా ఏమీ ప్రయోజనం వుండదు, సరికదా ఆ సంస్థ సమాజ ఆరోగ్యానికి అవరోధంగా పరిణమిస్తుంది. మనుషుల సముదాయంగా తప్ప సమాజమనేది కేవలం మిథ్యాభావనే; కనుక మంచి మనుషులు లేకుండా మంచి సమాజం వుండదు. అందువల్ల వైజ్ఞానికస్థాయి యొక్క, నైతికస్థాయి యొక్క విశిష్టతను గుర్తించి కొనసాగే తాత్విక భావోద్యమం ఎంతవరకు పెరిగితే అంతవరకే సామాజికాభ్యుదయం!

ఈ రకమైన ఆలోచనాధోరణి రాయ్ ఆలోచనల అంతర్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రాచీన కాలం నుంచీ సమాజాన్ని సంస్కరించే యత్నాలు సాగుతూనే వస్తున్నాయి. కాని జ్ఞానం పురోగమించకుండా సమాజం ఎక్కడా గుణాత్మకంగా పురోగమించలేదు. జ్ఞానం పురోగమించి సమాజం పురోగమించకుండా వుండలేదు. కాబట్టి జ్ఞానప్రధాన మైన భావోద్యమ మొక్కటే విజ్ఞులకు ధ్యేయం కావాలంటాడు రాయ్.

అలాంటి ఉద్యమం ఎలా పెరుగుతుంది? యూరపులో ఎలా పెరిగిందో ఇంచుమించు అలాగే. ఈనాటి భారతదేశంలాగా ఆనాటి యూరపు దేశాలు వర్ధమాన దేశాలు. పునర్వికాసోద్యమ ఫలితంగా అవి శాస్త్రజ్ఞానం సంపాదించుకొంటూ పెరిగినై. యూరపులో పునర్వికాస (రినైజాన్స్) ఉద్యమం కాఫీక్లబ్బులలో నుంచి పెరిగిందని మరవకూడదు.

రకరకాల రచయితలూ, మేధావులూ కాఫీక్లబ్బుల్లో కలుస్తుండేవారు. ఏ ముగ్గురో, నలుగురో కలిసి కాఫీలు సేవిస్తూ గంటలతరబడి చర్చించుకొనే వారు. ఇళ్ళకు వెళ్ళి చర్చల సారాంశాలపై పునరాలోచన చేసేవారు; తమ తమ నిర్ణయాలను రచనలద్వారా వెలువరించే వారు. అలాభావ బీజాలను సమాజంలో వెదజల్లుతూ వుండేవారు; అవి పదిమంది చైతన్యానికి దోహదమవుతూ వుండేవి. ప్రజలలో చైతన్యస్థాయి ఒక మట్టానికి చేరు

కున్నాక, సామాజికంగా రాచరికం అంతం కావటమూ ప్రజాస్వామ్యం పునరుద్ధరణ పొందటమూ జరిగింది. కనుక విప్లవం అంటే అభ్యుదయ కరమైన మార్పే అనుకుంటే—ప్రతి సామాజిక విప్లవానికి వెనుక మీటగా పనిచేసింది భావవిప్లవమే. మనసులు మారకుండా మనుషులు మారరు; మనుషులు మారకుండా సమాజం మారదు.

అలా అయితే సమాజం మారటానికి చాలకాలం పట్టదా? అంటారు. మనుషులు మారకుండానే సమాజం మారాలని వీరి తహతహ. ముఖ్యంగా వృత్తిరాజకీయంతో వ్యాపారంచేసే ఊరుకు పెరుమాళ్ళ వాదమంతా ఇదే. వీరి దృష్టిలో సమాజమంటే మనుషుల సముదాయం కాదేమో! దారి దూర మైనదిగా తోచినా, సరియైనదారే గమ్యానికి దగ్గర దారి. దగ్గరగా కని పిస్తున్నదని ముళ్ళదారి వెతుక్కుంటే, గుచ్చుకొన్న ముళ్లు తీసుకుంటూ అక్కడే కూర్చోవలసి వస్తుంది.

యూరపులో పునర్వికాసోద్యమం విస్తరించిన తీరు మనం దృష్టిలో వుంచుకుంటే భారతదేశంలాంటి వర్ధమాన దేశాలలో మన కర్తవ్యం మనకు బోధపడుతుంది. ఏమిటది? ముఖ్యంగా కొద్దిమంది సభ్యులతో అధ్య యన శిక్షణ శిబిరాలు విరవిగా జరపాలి. జరగవలసినవి అధ్యయన తర గతులు కాని అధ్యాపన తరగతులుకావు. అధ్యయన తరగతు లంటే—అవ గాహన పెంచుకోటానికి జరిగే చర్చలు. అధ్యాపన తరగతు లంటే—ఒకరు గంటల తరబడి బోధచేస్తుంటే, మిగతావారు బుద్ధిమంతులైన విద్యార్థు ల్లాగా వింటూ కూర్చోటాలు చర్చలేకుండా, భావసంఘర్షణ లేకుండా, అభి ప్రాయ భేదాలకు అస్కారం లేకుండా స్వతంత్రమైన జిజ్ఞాస సాధ్యంకాదు. అది లేనప్పుడు భావవిప్లవమూ లేదు; సాంఘిక విప్లవమూ లేదు.

భావోద్యమానికి ప్రాణప్రదాలైన అధ్యయన తరగతులు కొద్దిమంది సభ్యులమధ్య మాత్రమే సాధ్యం. వుద్యమ సాధనంగా రాడికల్ హ్యూమ నిస్టు సంఘం అలాంటి వాటిని ప్రోత్సహిస్తూ, ప్రయోజనకరమైన చిన్న చిన్న రచనలు చేయించి ప్రచారంలో పెట్టాలి. 15-18 శతాబ్దాల యూరపు ఉపనిషత్తుల భారతదేశం రాడికల్ హ్యూమనిస్టుల బుర్రల్లో మెదలక పోతే—వర్ధమాన భారతదేశానికి మిగతావారికంటె వాళ్ళు అదనంగా చేయ గలిగింది ఏదీ వుండదు. ఉద్యమ కార్యకర్తలు [illegible] సంఘం పార్టీ వైపు పయనించక తప్పదు.

A. C. No. 89591

# ఎన్. వి. బ్రహ్మం

## ఇతర రచనలు

అందుబాటులో

★ మెదడుకు మేత

★ 'హేతువాది' హేతివాదం

అచ్చులో

★ బైబిలు బండారం - మొదటి బాగం

అవతారిక

అసంబద్ధాలు

★ బైబిలు బండారం - రెండవ బాగం

అత్యాచారాలు

అసంభావ్యాలు

అవగతాలు

అవభ్రంశాలు

★ కళాతత్వం - శాస్త్రతత్వం



# విజ్ఞతకు విజ్ఞప్తి

కలలో దేవుడు కనిపించాడు నాకు. కాసేపు మేమిరువురం ఘర్షణ పడ్డాం. ఆయనకూ నాకూ వాదోపవాదాలు జరిగాయి. దేవుడు బలే గడుసుపిండంలే. ఎంత గడుసు కాకపోతే ఇంతగా నన్ను నిలదీసి అడుగుతాడు! చూడండి, ఆయన అడిగినపద్ధతి—

'పార్టీ నయితే రద్దుచేసుకొన్నావు. కాని తర్వాత నీవు చేస్తున్న దేమిటి? పార్టీ పోయినంత మాత్రాన పార్టీ తత్వం పోయిందని భ్రమిస్తున్నావు. మతతత్వం వెనక, పార్టీతత్వం వెనక పొంచివున్న సమష్టితత్వం నీ నిస్పృహాయ స్థితికి రూపాంతరం. అది అంత తేలికగా పోయేదనుకొంటున్నావా? సమష్టి తత్వం మాటున దాగివున్న మానసిక వాతావరణం మారనిదే, అది మరో రూపంలో వ్యవస్థీకరణ చెంది తీరుతుంది. సమయం చూచుకొని దాని అసలు రంగుతో బయటపడితీరుతుంది.'

'హేతుబద్ధమైన నైతికపద్ధతికి ప్రాముఖ్య మిచ్చే నవ్య మానవవాదుల ఆలోచన సదసద్వివేక సంపన్నంగా వుంటుంది కదా? అంటే ఏది తప్పో, ఏది ఒప్పో వాళ్ళకు స్పష్టంగా తెలుసు. తప్పు చేయరాదని తెలుసు; ఒప్పు చేయాలని తెలుసు. అయినా మానవసహజంగానే ఇతరుల లాగే అడపా దడపా తప్పులు చేస్తున్నారు; ఒప్పు చేయలేక పోతున్నారు. అంటే సదాలోచనవున్నా సదాచరణ సాధ్యం కావడం లేదన్నమాట. కాబట్టి ఆచరణను నడిపేది ఆలోచనే అనడం యథార్థం కాదని తేలడం లేదూ?'

—ఇలాంటి సమస్యలకు దేవుడు తన ధోరణిలో ఏవో పరిష్కారమార్గాలు సూచించా డనుకోండి. అయినా దేవుడి ధోరణి నాకు నచ్చలేదు. ఆయన మాటలు కొన్ని అర్థం కాక అయోమయంగా వున్నై. అయినా నేను మటుకు విన్నట్టే విన్నాను. విసుగెత్తి వినమ్రంగా వెళ్ళిపొమ్మన్నాను. వేదాంతం వినిపిస్తుంటే విసుగెత్తదూ మరి! అయితే మటుకు నన్ను 'మూర్ఖుడా' అని గర్జిస్తాడా దేవుడు?

## కలలో దేవుడు

అప్రమత్తంగా చదవండి; ఆకళింపు చేసుకోండి. దేవుడి తప్పు లెత్తిచూపుతూ నాకు రాయండి. మరో కలకని దేవుణ్ణి దుమ్ముదులిపేస్తాను యీసారి. సరేనా?

- ఎస్. ఏ. బ్రహ్మం.